తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం-26- జూలై - 2025 | సంపుటి : 3 | సంచిక : 60 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను
# కొట్టివేసిన సుప్రీంకోర్టు

- రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌పై పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం
- నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని 2022లో పిటిషన్ దాఖలు
- ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ
- 2026లో మొదటి జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా ఉందని వ్యాఖ్య

2లో

# భారీ వర్షాలతో జనం బెంబేలు





- విద్యుత్ సరఫరాలో అంతరాయం..
- అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో.. హైదరాబాద్‌తోపాటు నగర శివారు ప్రాంతాల్లో గత రెండ్రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ వర్షాల కారణంగా ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

మిగతా 2లో



# జువైనల్ హోమ్ నుంచి ఐదుగురు బాలలు మిస్

- మంత్రి సీతక్క సీరియస్
- విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సైదాబాద్ జువైనల్ హోమ్ నుంచి ఐదుగురు బాలలు తప్పించుకుపోయిన ఘటనపై మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు.

మిగతా 2లో



# ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులు..

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సీ హరికిరణ్, కరీంనగర్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్, నిజామాబాద్ ప్రత్యేక అధికారిగా ఆర్ హన్మంతు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేకాధికారిగా డీ దివ్యను నియమించింది. మహబూబ్‌నగర్ ప్రత్యేక అధికారిగా రవి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారిగా శశాంక, మెదక్ జిల్లా ప్రత్యేక అధికారిగా ఏ శరత్, ఖమ్మం ప్రత్యేకాధికారిగా కే సురేంద్రన్, హైదరాబాద్ జిల్లా ప్రత్యేక అధికారిగా ఇలంబర్తికి బాధ్యతలు అప్పగించింది.



# బీసీలపై ప్రేమ ఉంటే.. బీసీని సీఎం చేయాలి

మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామిని కాంగ్రెస్ పార్టీ ఉల్లఘించి.. అసలు బీసీ వర్గాలకు కాకుండా ఇతర వర్గాలకు లాభం చేకూరేలా వ్యవహరిస్తోందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో



# పీజీఈసెట్, లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్స్ విడుదల

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వచ్చే 202526 విద్యా సంవత్సరానికి గానూ ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీతో పాటు లా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదలయ్యాయి.

మిగతా 2లో

# 'కన్వర్టెడ్ బీసీ' అనే పదాన్ని రేవంత్ రెడ్డి కొత్తగా తీసుకు వచ్చారు

- నరేంద్ర మోదీ బీసీ కాదంటూ బీసీ సమాజాన్ని అవమానించారని విమర్శ
- రాహుల్ గాంధీ గురించి అడిగితే కాంగ్రెస్ నేతలు ఏం చెబుతారని ప్రశ్న
- ఆయనకు గోబెల్స్ బహుమతి ఇవ్వాలని చురక

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ కాదంటూ బీసీ సమాజాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. రాహుల్ గాంధీ గురించి అడిగితే కాంగ్రెస్ నాయకులు ఏం చెబుతారని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, మోదీ కన్వర్టెడ్ బీసీ అనే పదాన్ని రేవంత్ రెడ్డి కొత్తగా తీసుకు వచ్చారని విమర్శించారు. అందుకు ఆయనకు గోబెల్స్ బహుమతి ఇవ్వాలని ఎద్దేవా చేశారు. రాష్ట్ర బీజేపీ కమిటీలో 20 పోస్టులు మాత్రమే ఉన్నాయని రామచందర్ రావు అన్నారు. ఎనిమిది మంది ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఏడుగురు కార్యదర్శులు, ఒక కోశాధికారి పోస్టు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ కుటుంబ పార్టీ అయినందువల్లే జంబో కమిటీ ఉంటుందని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లుగా తనకు ఎలాంటి రాష్ట్ర పదవి లేదని, ఇప్పుడు అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని అన్నారు.






# తెలంగాణను రక్షించేది కేసీఆర్ ఒక్కరే



- ఆర్టికల్ 3 ఆధారంగా తెలంగాణ సాధన.. అంబేద్కర్ విశన్‌కు ఘన నివాళి
- కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం.. బోధించు, సమీకరించు, పోరాడు బాటలో
- అంబేద్కర్‌కు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన గౌరవం.. విగ్రహం, సెక్రటేరియట్ పేరు ద్వారా నివాళి
- దళిత బంధు పథకం వర్సెస్ కాంగ్రెస్ హామీలు.. కేటీఆర్ ఆరోపణలు రేవంత్‌పై


హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిరదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎంతో ముందు చూపుతో అంబేద్కర్ గారు పెట్టిన ఆ ఆర్టికల్ కారణంగానే తెలంగాణ కల సాకారమైందని తెలిపారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# భారీ వర్షాలతో జనం బెంబేలు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు మరో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఇక వర్షం.. కొంత సేపు ముసురులా.. మరికొంత సేపు భారీగా కురవడంతో పలు కాలనీలు నీట మునిగాయి. అలాగే రహదారులపైకి సైతం భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో నగరపాలక సంస్థ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆ నీరు సక్రమంగా వెళ్లే డ్రైనేజ్ మార్గం లేకపోవడంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక హైటెక్ సిటీ, ఎంజే మార్కెట్, మాదాపూర్, ఉప్పల్, కుషాయిగూడ, ముషీరాబాద్, అమీర్‌పేట్, చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌షుఖ్‌నగర్, కొత్తపేట్, ఎల్బీ నగర్, హయత్ నగర్, సరూర్ నగర్, కోఠి, అబిడ్స్, బేగంబజార్, పాతబస్తీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

**విద్యుత్ సరఫరాలో అంతరాయం..**

ఇక భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిరది. వివిధ ప్రాంతాల్లో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫోన్ చేసినా.. స్పందన కరువైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. జంట నగరాల శివారు ప్రాంతంలోని జలాశయాల నీటి మట్టం భారీగా పెరిగింది. మరోవైపు హుస్సేన్ సాగర్ నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. దీంతో దిగువనున్న ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇంకోవైపు.. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఏపీ, తెలంగాణ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజనపై ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి 2022లో పిటిషన్ దాఖలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పునర్విభజన సమయంలో.. ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ రోజు విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 26కు పరిమితి ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. 2026లో మొదటి జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల మిగతా రాష్ట్రాల నుంచి కూడా నియోజకవర్గాల పునర్విభజనపై పిటిషన్లు వచ్చే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. కేంద్రపాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టిసారించారన్న వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి మినహాయించడం.. ఏకపక్షం, వివక్షం కాదని చెబుతూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.



# జువైనల్ హోమ్ నుంచి ఐదుగురు బాలలు మిస్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇద్దరు సుపర్వైజర్లపై వేటు పడిరది. జైలు సూపరింటెండెంట్ కు మెమో జారీ చేశారు. జువైనల్ హోమ్ బాలలు తప్పించుకుపోకుండా అదనపు సిబ్బందిని నియమించాలని మంత్రి సీతక్క ఈ సందర్భంగా ఆదేశాలిచ్చారు. ఇదిలా ఉండగా, మంగళవారం రాత్రి జువైనల్ హోమ్ నుంచి ఐదుగురు బాలలు తప్పించుకుపోయారు. ఈ ఘటనపై సచివాలయంలో మంత్రికి జువైనల్ వెల్ఫేర్ శాఖ అధికారులు నివేదిక సమర్పించారు. జువైనల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చార్వాక్, అసిస్టెంట్ చీఫ్ ప్రొబేషన్ సూపర్వైజర్ నవీన్ ఘటన వివరాలను మంత్రికి వివరించారు. తప్పించుకుపోయిన ఐదుగురు బాలల్లో ముగ్గురు ఆచూకీ లభించిందని.. మిగిలిన ఇద్దరు బాలల ఆచూకీ కనుక్కునేందుకు పోలీసుల సహాయం తీసుకుంటున్నామని మంత్రికి అధికారులు వెల్లడిరచారు.



# పీజీఈసెట్, లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్స్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పీజీఈసెట్, లాసెట్‌కు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి శుక్రవారం నాడు విడుదల చేసింది ఈ రెండు సెట్లకు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి

లాసెట్ 2025కి సంబంధించి ఈ నెల 26వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆగస్టు 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వనున్నారు. 16, 17వ తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. ఆగస్టు 22వ తేదీన సీట్లు కేటాయింపు జరుగుతుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 22 నుంచి 25వ తేదీలోపు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇక పీజీఈసెట్



2025 అడ్మిషన్లకు సంబంధించి ఈ నెల 26వ తేదీన టిఫికేషన్ విడుదల కానుంది. ఆగస్టు 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వనున్నారు. 11, 12వ తేదీల్లో మొదటి విడతగా వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించనున్నారు. ఆగస్టు 16వ తేదీన సీట్ల కేటాయింపు జరగనుంది. ఆగస్టు 18వ తేదీ నుంచి 21 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

# చిన్నారిపై లైంగిక దాడి..

**◆ కామాంధుడికి కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష..**

దేశంలో ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. నిత్యం ఏదో ఓ చోట మహిళలు, ఆడపిల్లలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. నిర్భయ, పోక్సో వంటి చట్టాలను సైతం కామాంధులు లెక్క చేయడం లేదు. అత్యాచారం చేస్తే ఉరిశిక్ష పడుతుందనే భయం ఉంటేనే ఇవి ఆగేలా కనిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం ఖమ్మం జిల్లాలో అలాంటి ఘటనే జరిగింది. అభం శుభం తెలియని చిన్నారిపై కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు అరెస్ట్ చేసి నిందితుకి కఠిన శిక్ష పడేలా చేశారు. వాదనల తర్వాత న్యాయస్థానం అతడికి



20ఏళ్ల జైలు శిక్ష విధించింది. కోర్టు తీర్పుపై బాధిత కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. అతడికి 20 ఏళ్లు కాదు జీవితాంతం జైల్లోనే ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ధర్మాతండాలో నాలుగేళ్ళ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలుశిక్ష, 2 లక్షల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఉమాదేవి తీర్పు ఇచ్చారు. ధర్మా తండాకు చెందిన బానోతు రాములు అనే వ్యక్తి 2023 ఆగస్టులో ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేండ్ల బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కూసుమంచి పోలీసులు నిందితుడు రాములుపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అనంతరం ఎంక్వైరీ రిపోర్ట్‌ను కోర్టులో దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నిందితుడు రాములుకు 20ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధిత కుటుంబానికి 5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు. నిందితుడికి శిక్షపడేలా వ్యవహరించిన పోలీసులను ఖమ్మం సీపీ సునీల్ దత్ అభినందించారు.

# బీసీలపై ప్రేమ ఉంటే.. బీసీని సీఎం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీసీ రిజర్వేషన్లను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించకూడదని సూచించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని ప్రకటించినా.. అమలు విషయానికి వచ్చినప్పుడు అసలు బీసీలకు కాకుండా ముస్లిం వర్గాలకు మళ్లిస్తుండటం ఆందోళన కలిగించే అంశం అన్నారు. గతంలో 4% ముస్లిం రిజర్వేషన్లను హైకోర్టు రెండు మార్లు తిరస్కరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు స్టే ఆధారంగా అమలవుతున్నాయని చెప్పారు. ఇప్పుడు అదే రిజర్వేషన్ శాతం 10కి పెంచే ప్రయత్నం జరుగుతోందని.. ఇది సాంప్రదాయ బీసీ వర్గాలకు అన్యాయం చేసే అంశం అని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కాంగ్రెసు ఇటీవల విడుదల చేసిన కుల గణాంకాల్లో ముస్లిం వర్గాల సంఖ్యను బలవంతంగా బీసీల్లో చేర్చి.. బీసీల శాతాన్ని 56 నుంచి 46 శాతానికి తగ్గించినట్లు ఆరోపించారు. వాస్తవాలను దాచేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తుందని కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయించిన ఉదాహరణను గుర్తు చేశారు. ఆ సీట్లలో అధికశాతం అభ్యర్థులే గెలిచారని ఆరోపించారు. ఇప్పుడు కూడా బీసీ కౌంటుగా ముస్లిం అభ్యర్థులకే అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.. బీసీ కమీషన్‌కు రాజ్యాంగ హోదా, కేంద్ర కేబినెట్‌లో పలువురు బీసీ మంత్రుల నియామకం, కుల గణాంకాల కోసం చట్టబద్ధమైన ప్రయత్నాలు చేస్తూ.. బీసీల అభ్యున్నతికి కేంద్రం కృషి చేస్తుందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆయన కులాన్ని విమర్శించడం బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో హైకోర్టు ఆదేశాలను పాటించాలని డిమాండ్ చేసిన కిషన్ రెడ్డి.. రిజర్వేషన్లు నిజమైన బీసీలకు వర్తించాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి బీసీల పట్ల నిజంగా ప్రేమ ఉంటే.. తన పదవికి రాజీనామా చేసి బీసీ వర్గానికి చెందిన నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమించాలంటూ ఆయన సూచించారు.

# తెలంగాణను రక్షించేది కేసీఆర్ ఒక్కరే

(మొదటి పేజీ తరువాయి)

బోధించు, సమీకరించు, పోరాడు, అన్న బాబాసాహెబ్ బాటలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ ఉద్యమించారని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేటలో నిర్వహించిన ఆత్మగౌరవ గర్జన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. లక్షలాది మందిని సమీకరించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని వాళ్లకు బోధించి, ఎత్తిన జెండా దించకుండా 14 ఏళ్ల పాటు కేసీఆర్ కొట్లాడితే బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగం ఆధారంగా తెలంగాణ వచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఆ మహనీయున్ని గౌరవించుకోవడానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్టించుకున్నామని.జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమున్నతంగా గౌరవించుకున్నామని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును సెక్రటేరియట్ కు పెట్టిన ఒకే ఒక ముఖ్యమంత్రి భారతదేశంలో కేసీఆర్ ఒక్కరే అని కొనియాడారు. అంబేద్కర్‌ను అంత గొప్పగా గౌరవించుకున్న ముఖ్యమంత్రి దేశంలో ఇంకెవరూ లేరని అన్నారు.



దళితుల జీవితాల్లో అద్భుతమైన మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో లక్షలాది దళితులకు మేలు చేయాలన్న సంకల్పంతో దళిత బంధు పథకాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. దళిత బంధు పేరుమీద కేసీఆర్ రూ.10 లక్షల మాత్రమే ఇస్తున్నారని.. తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామని చేవెళ్లలో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ను రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు ప్రకటించారని గుర్తుచేశారు. అన్ని ప్రభుత్వ పనుల్లో 26% శాతం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారని.. దళిత, గిరిజనులు ఇండ్లు నిర్మించుకుంటే ఆరు లక్షలు ఇస్తామని ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లో చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆరు పైసలు కూడా ఇవ్వని సిగ్గులేని ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# కులగణనపై కాంగ్రెస్ పార్టీ తుది నిర్ణయం

◆ **42 శాతం రిజర్వేషన్ కోసం చట్టం**

**ఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనపై కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇచ్చింది. ఈ క్రమంలో ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత రాహుల్ గాంధీ సమక్షంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, బలహీన వర్గాల మంత్రులతో కూడిన ప్రతినిధి బృందం ఢిల్లీలో సమావేశమైంది.

రాహుల్ గాంధీ "భారత్ జోడో యాత్ర"లో గమనించిన సామాజిక అసమానతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చినప్పుడు కులగణన చేపడతామని హామీ ఇచ్చిన నేపథ్యంలో, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రక్రియ ప్రారంభించబడిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

2024 ఫిబ్రవరి 4న కులగణన చేపట్టాలని నిర్ణయించి, బీసీ కమిషన్ సూచనల మేరకు అభిప్రాయ సేకరణ, ప్రశ్నావళి రూపొందింపు, ఎన్యూమరేటర్ల నియామకం తదితర ప్రక్రియలు పూర్తి చేసినట్టు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా 3.5 కోట్ల మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనగా, అందిన సమాచారం ఆధారంగా కంప్యూటరీకరణ అనంతరం సబ్ కమిటీ పరిశీలనకు పంపి, కేబినెట్ ఆమోదంతో చట్టం రూపొందించారని చెప్పారు.

ఈ చట్టం ప్రకారం స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించబడినట్టు పేర్కొన్నారు. ఫిబ్రవరిలో గవర్నర్‌కు పంపిన బిల్లు, ఏప్రిల్ 30న న్యాయ సలహా అనంతరం రాష్ట్రపతికి వెళ్లిందని తెలియజేశారు. ప్రస్తుతం ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి ఎదురుచూస్తోంది.

ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేసిన విమర్శలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. "సామాజిక న్యాయాన్ని వ్యతిరేకించే వర్గాలకు మద్దతుగా బీజేపీ వ్యవహరిస్తోంది," అని వారు విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ బలహీన వర్గాల నేతలను అప్రామాణికంగా పక్కనపెట్టి వ్యవహరిస్తోందని ఆరోపించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు దిశగా ప్రభుత్వ ప్రయత్నాన్ని రాజకీయంగా కాకుండా, సామాజిక న్యాయపరంగా చూడాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. "ఇది బలహీన వర్గాల భవిష్యత్తు కోసం తీసుకున్న నిర్ణయం. దీన్ని వ్యతిరేకించే వర్గాలను ప్రజలు ప్రశ్నిస్తారు," అని స్పష్టం చేసింది.






# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు కల్పించాలి

◆ **జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్**

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంబంధిత శాఖలు సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలు జరగేలా చర్యలు తీసుకోవాలని, సిజేరియన్ లు తగ్గించే దిశగా అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలు, ఆర్‌బీఎస్‌కే, ఆరోగ్యశ్రీ, 108, టీహబ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డా. అ. అప్పయ్య జిల్లాలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, సీజనల్ వ్యాధులపై వివరాలు అందించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, గుర్తిస్తున్న సమస్యలపై కలెక్టర్ సమీక్షించారు. గుర్తించిన రోగులకు ఫాలోఅప్ సేవలు అందించాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగేలా, సిసెక్షన్లు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య మహిళా క్లినిక్స్ నుంచి రిఫర్ అయిన గర్భిణులకు తగిన ఫాలోఅప్ నిర్వహించాలని, రక్తహీనత కలిగిన గర్భిణులకు అవసరమైన చికిత్స అందించాలన్నారు.టీబీ ముక్త అభియాన్‌లో భాగంగా ఐరిస్క్ గ్రూపుల సభ్యులకు స్క్రీనింగ్, ఎక్స్‌రే, నాట్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎన్సిడీ కార్యక్రమంలో గుర్తించిన బీపీ, షుగర్ రోగులు మందులు పద్ధతిగా వాడుతున్నారా లేదో పర్యవేక్షించాలని, వారికి ప్రభుత్వ వైద్యం అందేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.


పని పనితీరు తక్కువగా ఉన్న ఉపకేంద్రాల్లో పర్యవేక్షణ మెరుగుపర్చాలని, అధికారులు తమ బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్మోహన్ రావు, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, టీబీ అధికారి డాక్టర్ హిమబిందు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అఖిల్, 108 కోఆర్డినేటర్ డెమో అశోక్ రెడ్డి, వివిధ ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సెంటర్ల బలోపేతానికి కేంద్రం ఏం చర్యలు చేపడుతోంది..?

◆ **కనీసం 80 శాతం మరియు 20శాతం లోపు పని దినాలు నిర్వర్తించిన కేంద్రాలు ఎన్ని ఉన్నాయి..?**

◆ **లోక్ సభలో కోరిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



అంగన్ వాడీ సెంటర్ల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ఏం చర్యలు చేపడుతోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా.. శుక్రవారం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. కనీసం 80 శాతం ఆ తర్వాత 20 శాతం లోపు పని దినాలు నిర్వర్తించిన కేంద్రాలు, అలాగే.. అప్‌గ్రేడ్ పురోగతి, నిధుల వివరాలు తెలపాల్సిందిగా కోరారు. దీనికి కేంద్ర మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

◆ పోషణ్ ట్రాకర్ డేటా ప్రకారం..2024 నుంచి ఈ ఏడాది జూన్ నాటికి కనీసం 80 శాతం పని దినాలు నిర్వర్తించిన సెంటర్లు దేశవ్యాప్తంగా.. 11,88,217 ఉండగా ఇందులో తెలంగాణవి 32,551 ఉన్నాయని, 20 శాతం లోపు తెరిచిన సెంటర్లు దేశవ్యాప్తంగా 29,830 ఉండగా.. తెలంగాణవి 386 కలవని కేంద్ర సహాయ మంత్రి తెలిపారు.

◆ మొత్తం 12,71,520 సెంటర్లకు తాగునీటి సౌకర్యం కలదని, మరుగు దొడ్డి సౌకర్యం ఉన్న కేంద్రాలు 10,60,429, వంట షెడ్డు కలిగినవి 9,32,777 సెంటర్లు ఉన్నాయని పేర్కొన్నారు.

◆ ఇక అప్ గ్రేడ్ కు సంబంధించి..2లక్షల సెంటర్లు ఎంపికయ్యాయని, ఇందులో తెలంగాణకు సంబంధించి 5,008 ఉన్నాయని, కేంద్రం రూ.30 కోట్లు కేటాయించగా... రూ. 2.7 కోట్లు మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి వివరించారు.

# చిల్కానగర్ బోనాల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

◆ **ఆలయాల అభివృద్ధికి 20 లక్షల నిధుల మంజూరు**

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**



చిల్కానగర్ డివిజన్‌లో ఆదివారం జరిగే బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆలయాల వద్ద అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అధికారులను ఆదేశించారు. మారల్ మైసమ్మ, పోచమ్మ, మజ్జిగౌరమ్మ ఆలయాలతో పాటు ఇతర ఆలయాల పరిసర ప్రాంతాల్లో సౌకర్యాల కల్పన కోసం 20 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో లభించాయని పేర్కొన్నారు.

శుక్రవారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి, విద్యుత్, శానిటేషన్ శాఖల అధికారులతో కలిసి పలువురు ఆలయాలను సందర్శించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. రాత్రి వేళ భక్తులకు ఇబ్బంది కలగకుండా వీధిదీపాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయాలకు వచ్చే మార్గాల్లో రహదారుల్లో గుంతలు లేకుండా ప్యాచ్‌వర్క్ చేయాలని ఇంజనీరింగ్ శాఖను కోరారు. బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆలయం వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, విద్యుత్, వెలుగు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, శానిటేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ చందన, ఎలక్ట్రిసిటీ సిబ్బంది రాము, వాటర్ వర్క్స్ సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు మరో ముందడుగు

◆ **భూసేకరణకు 205 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**



వరంగల్ విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ నిమిత్తం రాష్ట్రప్రభుత్వం 205 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య స్పందిస్తూ, మామునూరులో విమానాశ్రయ నిర్మాణానికి ఇది కీలక ముందడుగుగా పేర్కొన్నారు.

సాంకేతికంగా అడ్డంకిగా మారిన 150 కిలోమీటర్ల పరిమితిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి ఇప్పటికే అనుమతులు పొందిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. నిధుల విడుదలతో రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణం పట్ల చూపిన నిబద్ధతను మరోసారి స్పష్టంగా తెలిపినట్టు అభిప్రాయపడ్డారు.

చారిత్రక ప్రాధాన్యం కలిగిన వరంగల్ నగర అభివృద్ధిలో విమానాశ్రయం నిర్మాణం ఒక కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఈ ప్రాజెక్టుపై కేంద్ర విమానయాన శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

◆ **మన సురక్ష ఆసుపత్రి డాక్టర్ తొగరు విద్యాసాగర్**

**హుజురాబాద్ / తెలంగాణ ముచ్చట్లు:**



ఈనెల 27న పట్టణంలోని మన సురక్ష ఆసుపత్రిలో ఏవిస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తొగరు విద్యాసాగర్ తెలిపారు.ఈ వైద్య శిబిరంలో వెరికోస్ వేయిన్స్, కాళ్లు వాపు,మంట,దురద, కాళ్లలో రంగు మారటం,నరాలు ఉబ్బటం,కాళ్లలో పుండ్లు ఏర్పడడం,బరువెక్కడం వంటి సమస్యల పై పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్య వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఎలాంటి కోతలు, కుట్లు లేకుండా చికిత్స నిర్వహిస్తారని చెప్పారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, అధునాతన లేజర్ చికిత్స నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# కూకట్పల్లి ట్విన్ సిటీ సెంట్రింగ్ కాంట్రాక్టర్ యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు

**కూకట్పల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

కూకట్పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్ 115 పరిధిలో శుక్రవారం ట్విన్ సిటీ సెంట్రింగ్ కాంట్రాక్టర్ యూనియన్ ఎన్నికైన సందర్భంగా పగడాల బాబురావు నీ మర్యాద పూర్వకంగా కలిశారు. కూకట్పల్లి ట్రైన్ సిటీ కాంట్రాక్టర్ యూనియన్ నూతన అధ్యక్షుడు బైపోతు సత్యనారాయణ మరియు ప్రధాన కార్యదర్శి మేఘనాదం నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పగడాల బాబురావు నూతన కమిటీని ఎన్నికైన సందర్భంగా శాల్వాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు, బాబురావు బ్రదర్స్ లక్ష్మీనారాయణ శాంతారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీరును కలిసి వినతి

◆ **మంజూరైన పనులకు టెండర్లు ఆమోదించి ప్రారంభించాలని విజ్ఞప్తి**

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లను ఆమోదించి వర్క్ ప్రారంభించాలన్న అభ్యర్థనతో జీహెచ్ఎంసీ నిర్వహణ విభాగం చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సానుకూలంగా స్పందించిన చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్, టెండర్ ప్రక్రియ తక్షణమే ప్రారంభించి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వర్షాకాలంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

- ఎవరూ హెడ్ క్వార్టర్ ను విడిచి వెల్లకూడదు
- ఆగస్టు మొదటి వారంలో స్పెషల్ డ్రైవ్
- పీఆర్ఆర్డీ సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

గ్రామాల్లో పచ్చదనం స్వచ్ఛదనం పెంచేలా ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీ చేశారు. భారీవర్షాలతో గ్రామీణ రహదారులు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున..సత్వరమే పునరుద్ధరణపనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిత్య పర్యవేక్షణ కోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ ఆఫీస్ లో డీఈ, ఎస్ఈలతో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు సచివాలయంలో పీఆర్ ఆర్డీ శాఖపై మంత్రి సీతక్క జిల్లా అడిషనల్ కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. రూరల్ డ్రికింగ్ వాటర్, సానిటేషన్, రూరల్ రోడ్స్, ప్లాంటేషన్ పై సమీక్ష నిర్వహించారు. వెగవంతం చేయాలని పేర్కొన్నారు. వనమహెత్సవంలో భాగంగా 2.44 కోట్ల మొక్కలు నాటినట్లు అధికారులు నివేదించగా ...వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు.

మిషన్ భగీరథ పైప్ లైన్లను నిత్యం పరిశీలించాలని... వర్షాలు, వరదలతో పైప్ లు లీక్ అయితే తాగునీటి కలుషితం అయ్యే ప్రమాదం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగు నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అధికారులంతా క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్ఆరు. వర్షకాలం పూర్తయ్యే వరకు అధికారులెవరూ హెడ్ ఆఫీస్ ను విడిచి వెల్లరాదని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి రోజు సానిటేషన్, తాగు నీటి సరఫరా, గ్రామీణ రహదారుల పరిస్థితిపై రోజు వారి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారి చేశారు. ఈ సమీక్షలో మంత్రి సీతక్కతో పాటు శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎన్ శ్రీధర్, డైరెక్టర్ జీ. సృజన, ఈఎన్సీ లు కృపాకర్ రెడ్డి, ఎన్ అశోక్ తో పాటు ఇతర ఉన్నతాధికులు పాల్గొన్న తమ విభాగల పరిధిలో చేపట్టిన చర్యలను నివేదించారు.



# నూతన సిడిపిఓలతో మహిళా శిశు సంక్షేమానికి కొత్త శకం ప్రారంభం

- టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 23 మంది సిడిపిఓలకు నియామక పత్రాలు అందజేత

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

మహిళా శిశు సంక్షేమ శాఖలో కొత్త శకానికి నాంది పలికే విధంగా, టీజీపీఎస్సీ ద్వారా సిడిపిఓలుగా ఎంపికైన 23 మందికి మంత్రి సీతక్క సచివాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "సిడిపిఓలు మా శాఖకు వెన్నెముక లాంటివారు. అంకితభావంతో పనిచేస్తేనే చిన్నారులు, గర్భిణీలు, బాలింతల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి" అన్నారు.

"వేల మంది పోటీదారుల్లో మీరు ఎంపిక వడం ఎంతో గర్వకారణం. ఉన్నత విద్యావంతులైన మీరంతా మా శాఖలో చేరినందుకు అభినందనలు. సేవా దృక్పథంతో మానవతా విలువలతో పనిచేసే అవకాశం ఇది" అని పేర్కొన్నారు. ఆరు సంవత్సరాల వయస్సు వరకు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవ చేసే అరుదైన బాధ్యత సిడిపిఓలదని మంత్రి గుర్తు చేశారు. పోషకాహార లోపం నివారణ, దత్తత ప్రక్రియలు, మహిళా సాధికారత వంటి అంశాల్లో చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**అంగన్వాడీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

"అంగన్వాడి కేంద్రాల ద్వారా పేద ప్రజలకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. 57 రకాల ఆట వస్తువులు, వారంలో రెండు రోజుల బిర్యానీ, పాలూ, గుడ్లూ, యూనిఫాం వంటి అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నాం" అని మంత్రి వివరించారు.

**ఫీల్డ్ పనికే ఎక్కువ ప్రాధాన్యత**

సిడిపిఓలు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఫీల్డ్‌లో పనిచేయాలని సూచించిన మంత్రి, "మీ సూచనలు, సలహాలతో అంగన్వాడీ సేవల మౌలికత మెరుగవుతుంది. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిబద్ధతతో పనిచేయండి" అన్నారు.చివరగా, అంగన్వాడీలను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# దేశానికి ఆదర్శంగా అంగన్వాడి కేంద్రాలు

- నవంబర్ 19 నాటికి భవనాల నిర్మాణం పూర్తి చేయండి
- వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రంలోని అంగన్వాడి కేంద్రాలను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, భద్రతా సమస్యలు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు.

పలు అంగన్వాడి కేంద్రాల్లో వర్షాల కారణంగా పెచ్చులు ఊడే పరిస్థితి ఉండటంతో, ఇలాంటి భవనాలను తక్షణమే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ప్రైవేట్ భవనాలను అంగన్వాడి కేంద్రాలుగా మార్చాలన్నారు.

రాత్రి వేళల్లో తేళ్లు, జెరీలు వంటి విషపూరిత పురుగుల వల్ల ప్రమాదాలు తలెత్తే అవకాశమున్న నేపథ్యంలో కేంద్రాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. "మన ఇల్లు ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో అంగన్వాడి కేంద్రాలనూ అలాగే శుభ్రంగా ఉంచాలి" అని స్పష్టంచేశారు.

కొన్ని చోట్ల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన సీఎం, విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్వాడి కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రత, హాజరు శాతాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు అంగన్వాడి కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.

నవంబర్ 19 నాటికి 1000 కొత్త అంగన్వాడి భవనాల ప్రారంభం లక్ష్యంగా ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న 1000 నూతన అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించేలా భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ దిశగా లక్ష్యాన్ని నిర్దేశించిన ప్రభుత్వం, అవసరమైతే అదనపు నిధులను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.ఫీడింగ్, టీచింగ్, అటెండెన్స్ వంటి అంశాలపై యంత్రాంగం పూర్తి దృష్టి సారించాలని సూచిస్తూ, చిన్నారుల అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కీలకమైన వేదికలుగా మారాలని సీఎం ఆకాంక్ష వ్యక్తం చేశారు.







# జేఎన్ఎస్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా మైదానాలను, వసతి సదుపాయాలను ఆమె సమీక్షించారు.అథ్లెటిక్స్ ట్రాక్‌ను మొదట పరిశీలించిన కలెక్టర్, అనంతరం బాలురు, బాలికల హాస్టల్ గదులు, మేస్ హాస్టల్, గ్యాలరీలు వంటి నిర్మాణాలను పరిశీలించారు. స్టేడియంలోని వసతి సౌకర్యాలపై జిల్లా క్రీడా శాఖాధికారి అశోక్ కుమార్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో జేఎన్ఎస్ స్టేడియంలో తాత్కాలిక క్రీడా పాఠశాల ఏర్పాటుకు సంబంధించి ఉన్న ఏర్పాట్లు, అవసరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, క్రీడా కోచ్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిర సౌర గిరి జల వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలి

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ఇందిర సౌర గిరి జల వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు.

శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఐటీడీఏ, వ్యవసాయ, ఉద్యాన, గిరిజన సంక్షేమ, అటవీ, డిఆర్డిఏ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల స్థాయిలో కమిటీలు లబ్ధిదారుల ఎంపిక చేసి, జిల్లా స్థాయి కమిటీకి పంపేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలన్నారు. అవసరమైన భూమి పరిమాణం (2.20 ఎకరాలు) కలిగిఉండకపోతే, ఇద్దరు లేదా ముగ్గురు రైతులను కలిపి యూనిట్‌గా పరిగణించవచ్చని వివరించారు.అధికారుల వివరాల ప్రకారం, హనుమకొండ జిల్లాలో 202526 సంవత్సరానికి గాను 64 మంది గిరిజన రైతుల 58 ఎకరాల పోడు భూములకు ఈ పథకం కింద మంజూరులు జారీ అయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ. ఆరు లక్షల మేరకు బోరు, పంపుసెట్టు, 5 లేదా 7.5 హార్స్ పవర్ మోటారు, పైపులు, సోలార్ పలకలు వంటి వసతులు ఉచితంగా అందించనున్నట్టు అధికారులు వివరించారు. సమీక్ష సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిటిడిఓ ప్రేమకళ, డిఆర్డివో మేన శ్రీను తదితర అధికారులు పాల్గొన్నారు.





# లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఇన్వెస్టిచర్ సెర్మనీ

- కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ పబ్లిక్ స్కూల్ నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమానికి కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నియామక పత్రాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, పాఠశాల విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి బోధన విధానాలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక బాధ్యతలు, నాయకత్వ లక్షణాలను నేర్చుకోవడం అవసరమన్నారు. ఇలా అభివృద్ధి చెందిన పిల్లలే భవిష్యత్తులో క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జోసెఫ్ పసల, లుకాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు దొరికిన జిహెచ్ఎంసి డిప్యూటీ కమీషనర్

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

రాజేంద్రనగర్ పురపాలక సంఘం, జిహెచ్ఎంసి ఒకటవ వలయానికి చెందిన డిప్యూటీ కమీషనర్ కె.రవి కుమార్ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులకు పట్టుబడ్డారు.ఒక ఫిర్యాదుదారుని హోటల్ వంటగదిలో తనిఖీ సందర్భంగా గుర్తించిన అవకతవకల ఆధారంగా, హోటల్‌ను జప్తు చేయకుండా, హోటల్ ప్రతిష్ఠ దెబ్బతినకుండా ఉండేందుకు, భవిష్యత్తులో వ్యాపారం సజావుగా కొనసాగేందుకు రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు అనిశా వెల్లడించింది. అందులో భాగంగా, డిమాండుకు



అనుగుణంగా రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా అధికారులు ఆయనను పట్టుకున్నారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులపై పర్యటన

- ప్రాధాన్య రహదారి, బ్రిడ్జ్, క్రీడా ప్రాంగణాల ఏర్పాటుపై పరిశీలన

**కూకట్ పల్లి,తెలంగాణ ముచ్చట్లు:**



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి నియోజకవర్గంలోని కెపిహెచ్‌బి, ఫతేనగర్ డివిజన్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యల నివారణ, నగర అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

వసంతనగర్ కాలనీ నుంచి గోకుల్ ఫ్లాట్స్ మీదుగా హైటెన్షన్ రోడ్డుపై రైలు ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అవసరమైన ప్రదేశాన్ని పరిశీలించారు. కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్ ప్రాంగణాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనపై సమీక్ష జరిపారు. జేఎన్టీయూ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి స్కై వే ఏర్పాటుపై చర్చించారు.

అలాగే, మూసాపేట ఆంజనేయ నగర్ చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ మరియు అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఫతేనగర్ వెంకటేశ్వరనగర్‌లో శిథిలావస్థలో ఉన్న పాత నడక బ్రిడ్జ్‌ను పునర్నిర్మించాలని సూచించారు.

పర్యటనలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, పండాల సతీష్ గౌడ్, ఎస్.సీ. చిన్నారెడ్డి, ఈఈ రమేష్, డీఈ శంకర్, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య సిబ్బందికి రక్షణ పరికరాల పంపిణీ

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కిట్లు అందజేత

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**



ఉప్పల్ నియోజకవర్గంలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని గ్రౌండ్‌లో జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నగర పరిశుభ్రతకై శ్రమించే పారిశుధ్య సిబ్బంది సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. వారి సేవను ఎంతగానైనా గౌరవించాల్సిన అవసరం ఉందని, ఒక రోజు కూడా శానిటేషన్ సిబ్బంది లేకపోతే నగర వాతావరణం ప్రభావితమవుతుందని చెప్పారు. పారిశుధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవంతో చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, శానిటేషన్ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలక సంస్థను వ్యక్తిగత ఆదేశాలకు వాడకూడదు

- కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అభ్యంతరం
- శంకుస్థాపన ఏర్పాట్లపై కార్పొరేటర్‌కు సమాచారం లేకపోవడంపై ఆగ్రహం

**కూకట్‌పల్లి, తెలంగాణ ముచ్చట్లు:**



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపన శిలాఫలకాల ఏర్పాటుపై స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధిత పనులపై కార్పొరేటర్‌కు ముందుగా సమాచారం ఇవ్వకుండా, పదవిలో లేని వ్యక్తుల సూచనల మేరకు అధికారులు నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

ఇలాంటి చర్యలు ప్రజాప్రతినిధుల హక్కులను విస్మరించినట్లే కాకుండా, ప్రజల్లో సంస్థపై నమ్మకాన్ని తగ్గించే అవకాశముందని వ్యాఖ్యానించారు. గత 10 నెలలుగా అనుపమ బ్యాక్ సైడ్ సిమెంట్ రోడ్డు పనులు మంజూరై ఉన్నప్పటికీ, వాటిని కొనసాగించకుండా నిలిపివేయడం వలన వర్షాకాలంలో ఆ ప్రాంతంలో రెండు అడుగుల వరకూ నీరు నిలిచే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దాంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

వేదేపల్లి ఎన్క్లేవ్ నుంచి మాధవరం నగర్ కాలనీ వరకు నిర్మించిన కల్వర్టు, రోడ్డు ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాలన్నింటిపై జోనల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.



# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

**యూఏఈ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు**

తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా చిన్నదైనా ఆశయాలు, ఆచరణలో చాలా పెద్దదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని, జీడీపీఎస్ జాతీయ సగటుకన్నా అధికంగా ఉందని, దేశ జీడీపీలో 5శాతం వాటా తెలంగాణదేనని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు యూఏఈ సంయుక్తంగా గురువారం హైదరాబాద్‌లో 'ఇన్వెస్టోపియా గ్లోబల్' పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధనం, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో ఎగుమతులు, ఏరోస్పేస్, డిఫెన్స్, తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్ మొబిలిటీ, పర్యాటకం, వెల్‌నెస్, మెడికల్ తదితర రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని మంత్రి చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆయన యూఏఈ ప్రతినిధులను ఆహ్వానించారు. 202425లో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయన్నారు.

## బ్రిటన్ ఒప్పందంతో భారీగా తగ్గనున్న కార్లు, వైద్యపరికరాల ధరలు..!



భారత్, బ్రిటన్ మధ్య చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇరుదేశాలు పరస్పరం పన్ను మినహాయింపుతో కూడిన అగ్రిమెంట్ చేసుకున్నాయి. రెండు దేశాల ప్రధానులు నరేంద్ర మోడీ, కీర్ స్టార్మర్‌ల సమక్షంలో గురువారం కేంద్ర వాణిజ్య మంత్రి పీయుష్ గోయల్, యూకే మినిస్టర్ జొనాథన్ రెనాల్డ్స్ సంతకాలు చేశారు. ఈ డీల్‌తో ఏడాదిలోనే రెండు దేశాల మధ్య రూ.29 లక్షల కోట్ల వ్యాపారం జరగనుంది అంచనా. యూరోపియన్ సభ్య దేశాల నుంచి యూకే బయటికి వచ్చిన పదేళ్లలో ఆ దేశంతో భారత్ చేసుకున్న అతిపెద్ద ఒప్పందం ఇదే. అందుకే భారత్, బ్రిటన్ వ్యాపార సంబంధాల పరంగా ఈ ఒప్పందం ఒక మైలురాయి లాంటిదని ప్రధాని మోడీ అన్నారు. మనదేశంలోని రైతులు, మత్స్యకారులు, చిన్న వ్యాపారసంస్థలు.. ఈ అగ్రిమెంట్ లబ్ది చేకూర్చనందని మోడీ పేర్కొన్నారు. ఈ డీల్ కారణంగా యూకేకు మనదేశం ఎగుమతి అయ్యే 99 వస్తువులు, ఇతరాలకు స్టాంపు డ్యూటీ, టారిఫ్‌లు వర్తించవు. ముఖ్యంగా జౌలీ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, సీఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, లెదర్ వస్తువులు, ఇంజనీరింగ్ ప్రొడక్ట్స్ వంటి వాటికి ఇకపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.


చౌకగా కార్లు, విస్కీ : ఇక బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే కార్లు, విస్కీ, చాక్లెట్లు, సౌందర్య ఉత్పత్తులుతో పాటు వైద్య పరికరాలు, ఏరోస్పేస్ పార్ట్స్ మీద టారిఫ్స్ విధించరు. వీటిపై గతంలో ఉన్న టారిఫ్‌ను 15 శాతం నుంచి 3 శాతానికి తగ్గనుంది. అంటే.. ఇవన్నీ ఇకపై భారతీయులకు చౌకగా లభించనున్నాయి.

# కెనరా బ్యాంక్ లాభం రూ.4,752 కోట్లు




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.4,752 కోట్ల నికర లాభాన్ని గడిరచింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ. 3,905 కోట్ల లాభంతో పోలిస్తే 22 శాతం వృద్ధిని కనబరిచినట్టు బ్యాంక్ వర్గాలు వెల్లడిరచాయి. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.38,063 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.28,701 కోట్ల నుంచి రూ.31 వేల కోట్లకు చేరుకోవడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని పేర్కొంది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ ఏడాది ప్రాతిపదికన 4.14 శాతం నుంచి 2.69 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ కూడా 1.24 శాతం నుంచి 0.63 శాతానికి దిగొచ్చింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.1,845 కోట్ల స్థాయిలో నిధులను వెచ్చించింది.

# 54 శాతం పెరిగిన కోరమాండల్ ఇంటర్నేషనల్ లాభం



కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.7,083 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.508 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 54 శాతం వృద్ధి చెందగా ఆదాయం 49 శాతం పెరిగింది. ఈ కాలంలో న్యూట్రియంట్, అలైడ్ వ్యాపారాల ఆదాయం రూ.4,198 కోట్ల నుంచి రూ.6,311 కోట్లకు పెరగగా క్రాప్ ప్రొటెక్షన్ వ్యాపారం రూ.551 కోట్ల నుంచి రూ.724 కోట్లకు పెరగటం కలిసి వచ్చిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో 7.5 లక్షల టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఫెర్టిలైజర్ గ్రాన్యులేషన్ ప్లాంట్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు తెలిపింది.

# హనుమకొండ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

వర్షాకాలం నేపథ్యంలో ప్రజల భద్రత, సౌకర్యాలకై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు.

భారత వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో శుక్రవారం ఈ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు 24 గంటలపాటు ఈ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 1115 ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.




# మహంకాళి బోనాల సందర్భంగా మందముల పరమేశ్వర్ రెడ్డికి ఆహ్వానం

- ఉప్పల్ మహంకాళి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానం

**ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ మహంకాళి దేవాలయంలో బోనాల ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తెల్కల మోహన్ రెడ్డి, ఈఓ వీరేశం, సభ్యులు రాఘవేందర్ గుప్తా, గుమిడెల్లి కృష్ణ, మేనంపల్లి అండలు, అలుగుల అనిల్ కుమార్, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# లక్ష దిగువకు బంగారం ధర




బంగారం, వెండి ధరలు గురువారం భారీగా తగ్గాయి. ఢిల్లీలో 99.9 స్వచ్ఛత (24 క్యారెట్) కలిగిన పుత్తడి 10 గ్రాముల విలువ రూ.1,400 పడిపోయి రూ.99,620గా ఉన్నది. అలాగే కిలో వెండి రేటు రూ.3,000 క్షీణించి రూ.1,15,000 వద్ద నిలిచింది. బుధవారం ఒక్కరోజే రూ.4,000 ఎగిసి ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ. 1,18,000 పలికిన విషయం తెలిసిందే. ఇక హైదరాబాద్ విషయానికొస్తే.. 24 క్యారెట్ తులం రేటు రూ. 1,360 పతనమై రూ. 1,00,970గా నమోదైంది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.1,250 దిగి రూ. 92,550గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు 3,362.88 డాలర్లుగా, వెండి 39.05 డాలర్లుగా ఉన్నాయి. ఆయా దేశాలతో అమెరికా వాణిజ్య ఒప్పందాల్ని చేసుకుంటుండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగుతున్నారని, దీంతో డిమాండ్ పడిపోయి ధరలు క్షీణిస్తున్నాయని మార్కెట్ నిపుణులు ట్రేడిరగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

# ఐఆర్‌డీఏఐ చైర్మన్‌గా అజయ్ సేథ్



భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) చైర్మన్‌గా ఆర్థిక శాఖ, ఆర్థిక వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి అజయ్ సేథ్‌ను ప్రభుత్వం నియమించింది. నియామకాల వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ నియామకానికి ఆమోదం తెలిపింది. అధికార బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడు సంవత్సరాల కాలం లేదా 65 సంవత్సరాల వయసు నిండే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన సేథ్ ఈ ఏడాది జూన్‌లోనే రిటైర్ అయ్యారు. దేబాశిష్ పాండా ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చేసిన నాటి నుంచి ఐఆర్‌డీఏఐ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది.



# ఇండియన్స్‌కు జాబ్స్ ఇవ్వొద్దు

గూగుల్, మైక్రోసాఫ్ట్, వంటి భారీ టెక్ కంపెనీలు భారతీయులను నియమించుకోవడం ఆపి, అమెరికన్లపై దృష్టి పెట్టాలని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బలమైన సందేశం పంపారు. ఆయన బుధవారం వాషింగ్టన్ డీసీలో జరిగిన ఏఐ సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్ కంపెనీల గ్లోబలిస్ట్ మైండ్‌సెట్ ను ఆయన విమర్శించారు. చాలా మంది అమెరికన్లు తమను పట్టించుకోవడం లేదన్న భావన లో ఉన్నట్టు పేర్కొన్నారు. దేశంలో లభించిన స్వేచ్ఛను వాడుకొని చాలా టెక్ కంపెనీలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. తన పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయని చెప్పారు. " మన దేశం లోని చాలా భారీ టెక్ కంపెనీలు చైనాలో కంపెనీలు నిర్మిస్తూ భారతీయ ఉద్యోగులను నియమించుకుంటూ ఐర్లాండ్‌ను అడ్డం పెట్టుకుని తక్కువ లాభాలు చూపుతూ స్వేచ్ఛను అనుభవించాయి. ఆ విషయం మీకు తెలుసు. అక్కడి ప్రజల అవకాశాలను పట్టించుకోకపోవడం నిర్లక్ష్యం చేయడం వంటివి చేశారు. ట్రంప్ పాలనలో ఆ రోజులు ముగిసిపోతాయి. ఏఐ రేసులో విజయం సాధించాలంటే సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశ భక్తి అవసరం. ఇక్కడ ఉన్న టెక్నాలజీ కంపెనీలు మొత్తం అమెరికా కోసమే. దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తూ పనిచేయాలి. మీరూ అది చేయాలి. అదే నేను కోరుతున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సదస్సులో ట్రంప్ మేధకు సంబంధించి మూడు కీలక ఆదేశాలపై సంతకాలు చేశారు. ఏఐకు ఉన్న ఆటంకాలను తొలగించడం, అభివృద్ధిని వేగవంతం చేయడం, ఇక ప్రభుత్వ నిధులు పొందుతున్న సంస్థలు తయారు చేసే ఏఐ టూల్స్ రాజకీయంగా తటస్థ వైఖరితో ఉండేలా చూడటం వంటి అంశాలున్నాయి.

# థాయ్, కాంబోడియా సైనిక ఘర్షణలు..

థాయ్, కాంబోడియా సైనికుల మధ్య గురువారం తీవ్రస్థాయి ఘర్షణలు జరిగాయి.ఈ ఘటనల్లో కనీసం 11 మంది మృతి చెందారు. వీరిలో ఎక్కువ మంది పౌరులే అని వెల్లడైంది. సరిహద్దుల వెంబడి అనేక చోట్ల ఇరుపక్షాల మధ్య చిన్న పాటి ఆయుధాలు, రాకెట్లతో పరస్పరం దాడులు జరిగాయి, థాయ్‌లాండ్ ఓ దశలో విమానాలతో కూడా బాంబులు కురిపించింది. ఉదయం ఆరంభమైన పరస్పర కాల్పులు తీవ్రతరం కావడంతో థాయ్ గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. పలు చోట్ల సహాయక శిబిరాలలో తలదాచుకుంటున్న జనం, గందరగోళం పరిస్థితుల వీడియోలు వెలుగులోకి వచ్చాయి. సరిహద్దు ప్రాంతాలలోని అత్యంత ప్రాచీన పురాతన ఆలయాలు, కట్టడాల గురించి తరచూ సాయుధ ఘర్షణలు జరగడం పరిపాటి అయింది. ప్రత్యేకించి 9వ శతాబ్ధానికి చెంది ప్రీహ్ విహార్ గురించి 500 కిలోమీటర్ల దూరం సరిహద్దుల వెంబడి అప్రకటిత ఘర్షణలు జరగడంతో ఆగ్నేయాసియా ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

# కరువు రక్కసి కాటేస్తోంది

**ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమంతో గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. అన్నార్తుల ఆర్తనాదాలతో నగరం ప్రతిధ్వనిస్తోంది. ఎక్కడ చూసినా కరువు విలయతాండవం చేస్తోంది. రెండు లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు ఆహార అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నారని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో యునిసెఫ్ ఇటీవల విడుదల చేసిన పోస్ట్ తెలిపింది. వారంతా తీవ్రమైన ఆహార కొరతతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే గాజాలో పెద్ద ఎత్తున ఆకలి మరణాలు సంభవిస్తాయని వందకు పైగా ఎన్జీఓలు హెచ్చరించాయి. గాజాలో తొమ్మిది లక్షల మంది చిన్నారులు ఆకలితో అలమటిస్తున్నారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలియజేసింది. వీరిలో 70,000 మంది ఇప్పటికే పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. గాజాలోని పేషెంట్స్ ఫ్రండ్స్ బెనెవొలెంట్ సొసైటీ ఆస్పత్రి వార్డులోకి వెళితే ఒళ్లు గగుర్పొడిచే దృశ్యాలు కన్పిస్తున్నాయి. డొక్కలు ఎండిపోయి, అస్థిపంజరాలుగా కన్పిస్తున్న పిల్లలతో ఆ ఆస్పత్రి కిటకిటలాడుతోంది. పడకలు చాలకపోవడంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి పిల్లలను ఉంచుతున్నారు. ప్రస్తుతం గాజా నగరంలో చిన్న పిల్లలకు వైద్య సేవలు అందించే బృందాలు రెండు మాత్రమే ఉన్నాయి. ప్రతి రోజూ 200 మందికి పైగా పిల్లలు చికిత్స కోసం ఆస్పత్రిలో చేరుతున్నారు. గాజాకు అత్యవసర సహాయ సామగ్రి చేరకుండా ఇజ్రాయిల్ దళాలు అష్టదిగ్బంధం చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిరదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అధిపతి తెలిపారు. సహాయాన్ని అడ్డుకోవడం, ఆంక్షలు విధించడం వంటి చర్యల కారణంగా గాజాలో ఆకలి సంక్షోభం తీవ్రతరమవుతోందని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రాస్ అధ్నానమ్ గేబ్రియేసస్ హెచ్చరించారు. ఆహార సరఫరాలను మార్చి నుంచే ఇజ్రాయిల్ అడ్డుకోవడంతో ప్రస్తుతం గాజాలో ఆహార నిల్వలు అడుగంటుతున్నాయి. మేలో ఆంక్షలను పాక్షికంగా తొలగించినప్పటికీ సరఫరాలూ అరకొరగానే ఉన్నాయి. ఆహారం కోసం వేచి ఉన్న ప్రజలపై ఇజ్రాయిల్ సైనికులు జరుపుతున్న కాల్పుల్లో మే నుంచి ఇప్పటి వరకూ వెయ్యి మందికిపైగా మరణించారని ఐక్యరాజ్యసమితి తెలిపింది.**

# మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు..

మణిపుర్‌లో రాజకీయ సంక్షోభం నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 13న అక్కడి ముఖ్యమంత్రిగా కొనసాగుతోన్న బీరెన్ సింగ్ తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఈ క్రమలోనే రాష్ట్రంలో పాలన రద్దు కాగా.. అప్పటి నుంచి రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. మణిపుర్లో శాంతి భద్రతలు దిగజారడం, రెండు తెగల మధ్య ఘర్షణలు, పరస్పర ద్వేషాలు తీవ్రరూపం దాల్చడంతో రాష్ట్రపతి పాలనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, అక్కడ పరిస్థితులు ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతుండటంతో తాజాగా కేంద్రం మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో విషయంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సభకు అందుకు ఆమోదం తెలిపింది. తాజాగా పరిణామంతో మణిపుర్ మరో ఆరు నెలల పాటు రాష్ట్రపతి పాలన కొనసాగనుంది. అందుకు సంబంధించి రాష్ట్రపత్రి కార్యాలయం నుంచి నోటిఫికేషన్ వెలువడిరది. ఫిబ్రవరి 2026 వరకు మణిపూర్ రాష్ట్రం ప్రెసిడెంట్ రూల్‌లో ఉండనుంది.

# బీహార్‌లో 61 లక్షలకు పైగా ఓటర్లు అవుట్ !

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న బీహార్‌లోని ఎస్ఐఆర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. శుక్రవారంతో ఈ ప్రక్రియ ముగియనుంది. అయినా ఇంకా అవసరమైన పత్రాలు సమర్పించని వారు సుమారు ఏడు లక్షల మంది ఉన్నారు. ఎన్నికల కమిషన్ గురువారం వెల్లడిరచిన సమాచారం ప్రకారం 91.32 శాత మంది (7.21 కోట్ల మంది) ఓటర్లు ఇప్పటి వరకూ గణన ఫారంలు సమర్పించారు. వీటిని స్వీకరించి డిజిటలైజ్ చేసినట్లు ఇసి తెలిపింది. వీరు పేర్లన్నంటినీ కూడా ఆగస్టు 1న ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చనున్నారు. ఈ ఏడాది జనవరి ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 7,89,69,844 మంది ఓటర్లు ఉన్నారు. ఈ జాబితాను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రకారం సవరణ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇసి సమాచారం ప్రకారమే వీరిలో 7.21 కోట్ల మంది ఫారంలు సమర్పించారు. 21.6 మంది మరణించిన ఓటర్లు కాగా, మరో 31.5 లక్ష మంది ఓటర్లు రాష్ట్రం నుంచి శాశ్వతంగా వలస వెళ్లారు. ఏడు లక్షమంది ఓటర్లు గణన ఫారంలు సమర్పించలేదు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్న ఓటర్లు ఏడు లక్షల మంది, గుర్తించలేని ఓటర్లు లక్ష మంది ఉన్నారని ఇసి తన సమాచారంలో వెల్లడిరచింది. దీని ప్రకారం ఆగస్టు 1న ప్రచురించే ఈ జాబితాలో ఈ 61 మంది పేర్లను తొలగించనున్నారు. ఎస్ఐఆర్ మార్గదర్శకాల ప్రకారం నూతన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన తరువాత ఈ జాబితా కాపీని రాష్ట్రంలోని 12 ప్రధాన రాజకీయపార్టీలకు అందిస్తారు. అలాగే ఇసిఐ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచుతారు. ఇప్పటికే బూత్‌స్థాయి ఓటర్ల జాబితాను, ఫారాలు నింపని ఓటర్లు, మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల జాబితాను ఈ నెల 20న అన్నిరాజకీయ పార్టీలతో ఇసి పంచుకుంది. వీటిపై అభ్యంతరాలు తెలపాలని కోరింది. అలాగే, ముసాయిదా జాబితాపై కూడా అభ్యంతరాలను ఏ ఓటరైనా, లేదా ఏ రాజకీయ పార్టీ అయినా కూడా సెప్టెంబర్ 1 వరకూ ఫిర్యాదు చేయవచ్చనని ఇసి చెబుతోంది. కాబట్టి ముసాయిదా జాబితాను ఆగస్టు 1న విడుదల చేసినా జాబితాలో ఓటర్లను చేర్చడం, తొలగించడం సెప్టెంబరు 1 వరకూ కొనసాగుతుందని ఇసి తెలిపింది. కాగా, ఎస్ఐఆర్‌పై వస్తున్న విమర్శలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ మాట్లాడుతూ మరణించిన వారి పేర్లు, ఇతర ప్రదేశాల నుంచి వారి పేర్లు జాబితాలో చేర్చాలా అని ప్రశ్నించారు.






# రష్యాలో కుప్పకూలిన విమానం

రష్యాకు చెందిన ఏఎన్24 విమానం రాడార్ నుంచి సంబంధాలు తెగిపోయి చైనా సరిహద్దుల్లోని తూర్పు ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో దాదాపు 49 మంది వరకు ప్రయాణికు లు ఉన్నారని తెలుస్తోంది. తొలుత విమానం అదృశ్యమైనట్టు వార్తలు రాగా, కాసేపటి క్రితమే కూలిపోయిందని అధికారులు నిర్ధరించారు. రష్యన్ వార్తా కథనాల ప్రకారం, గురువారం తెల్లవారుజామున 49 మంది ప్రయాణికులతో వెళ్తున్న రష్యా విమానం తొలుత అదృశ్యమయ్యింది. సైబీరియా చెందిన అంగారా ఎయిర్‌లైన్స్ ఏఎన్24 విమానం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది. మరికొద్దిసేపట్లో ల్యాండిరగ్ అయ్యే సమయానికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లతో విమనానికి సంబంధాలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం వెంటనే ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. అదృశ్యమైన కొద్దిసేపటికే రష్యా అత్యవసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ విమానం ''కాలిపోతున్న ఫ్యూజ్‌లేజ్''ను కనుగొన్నట్టు తెలిపింది. అయితే ఆ విమానం ల్యాండ్ అయ్యేందుకు 15 కిలోమీటర్లు దూరంలో ఉండగా కూలిపోయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. చైనా సరిహద్దుల్లోని టిండా విమానాశ్రయానికి చేరువలోనే విమాన ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో విమానంలో ఐదుగురు పిల్లలు, ఆరుగురు సిబ్బందితో సహా 43 మంది ప్రమాణికులు ఉన్నారని రష్యన్ మీడియా కథనాలు తెలిపాయి. సహాయ చర్యల కోసం ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. కాగా, ఘటనాస్థలంలో భారీగా మంటలు చెలరేగాయి. రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహయక చర్యల్లో పాల్గొన్నారు. విమానం తొలుత ల్యాండిరగ్‌కు ప్రయత్నించగా అది విఫలం కాగా, మరోసారి ల్యాండిరగ్ చేసేటపుడు ప్రమాదానికి గురైనట్టు తెలుస్తోంది.

# పుర్కాయస్థకు ముందస్తు బెయిల్




**న్యూఢిల్లీ :** న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు, ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థకు రెండు వేర్వేరు కేసుల్లో ఢిల్లీ హైకోర్టు బుధవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. విదేశీ నిధులు స్వీకరించారంటూ ఢిల్లీ పోలీసులు పెట్టిన కేసు కూడా ఇందులో ఒకటి. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తు చేస్తున్న మనీ లాండరింగ్ కేసులో కూడా పుర్కాయస్థకు ఉపశమనం లభించింది. ఈ కేసులు 2020లో నమోదయ్యాయని కోర్టు పేర్కొంది. కానీ ఇప్పటివరకు దర్యాప్తులేవీ పూర్తి కాలేదని, చార్జిషీట్ దాఖలు కాలేదని కోర్టు పేర్కొంది. ''దర్యాప్తులకు హాజరు కావాల్సిందిగా దరఖాస్తుదారుని 2023 నుండి ఇంతవరకు పిలిచిన దాఖలాలు కూడా లేవని పేర్కొంది. దరఖాస్తుదారుడు గౌరవప్రదమైన వ్యక్తి. 75ఏళ్ళకు పైబడిన వృద్ధుడు. సమాజంలో ఆయనకంటూ ఒక హోదా వుంది. వున్న సాక్ష్యాధారాలు ఏవైనా డాక్యుమెంటరీ తరహాలోనే వున్నాయి. కాబట్టి వాటిని తారుమారు చేసే అవకాశాలు లేవు, లేదా సాక్షులను ప్రభావితం చేసేందుకు కూడా అవకాశం లేదు.'' అని కోర్టు పేర్కొంటూ ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 201819 ఆర్థిక సంవత్సరంలో అమెరికాలోని వరల్డ్‌వైడ్ మీడియా హోల్డింగ్స్ నుండి రూ.9. 59కోట్ల మేరకు విదేశీ నిధులను న్యూస్‌క్లిక్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్ స్వీకరించిందని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. డిజిటల్ న్యూస్ వెబ్‌సైట్‌లో 26శాతం ఎఫ్‌డిఐలపై గల పరిమితిని అడ్డుకునేందుకు కంపెనీ షేర్ల విలువను ఎక్కువ చేసి చూపించి, ఈ పెట్టుబడులు పెట్టారని ఎఫ్ఐఆర్ పేర్కొంది. ఈ పెట్టుబడుల్లో 45శాతానికి పైగా మొత్తాలు సిబ్బంది వేతనాలు లేదా కన్సల్టెన్సీ ఫీజులకు, ఇతర ఖర్చులకు మళ్ళించారని కూడా ఆ ఎఫ్ఐఆర్ పేర్కొంది. ఈ ఎఫ్ఐఆర్ ప్రాతిపదికన ఇడి దర్యాప్తు చేపట్టింది. న్యూస్‌క్లిక్ కార్యాలయ ఆవరణల్లో, పలు ఇతర ప్రాంతాల్లో ఇడి సోదాలు నిర్వహించింది.



# బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్యం

చరిత్రాత్మకమైన భారీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారతదేశం, బ్రిటన్ గురువారంనాడు సంతకాలు చేశాయి. దీని ద్వారా ఉభయదేశాల మధ్య ఏటా 34 బిలియన్ అమెరికా డాలర్ల మేరకు వాణిజ్యం జరుగుతుందని భావిస్తున్నారు 2020లో యురోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగిన తర్వాత ఒకదేశంతో కుదుర్చుకున్న అతి పెద్ద వాణిజ్య ఒప్పందం ఇదే. లండన్ లో భారత ప్రధాని మోదీ, బ్రిటీష్ ప్రధాని కీర్ స్టార్మర్ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఈ ఒప్పందం కుదిరింది. బ్రిటన్ విదేశీ వ్యాపారం, వాణిజ్య శాఖ మంత్రి జోనాథన్ రేనాల్డ్స్, భారత వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. బ్రిటన్ లో రెండురోజుల అధికార పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ , బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఉభయదేశాల మధ్య కుదిరిన ఫ్రీ ట్రేడ్ ఒప్పందం రెండుదేశాల పురోభివృద్ధికి ప్రాతిపదిక కాగలదని అన్నారు. దీంతో వాణిజ్యం ఇమ్మడి ముమ్మడిగా పెరుగుతుందని వివరించారు. ఉభయదేశాలకు ఇది చరిత్రలో గుర్తుండి పోయే రోజు అంటూ, పలు ఏళ్ల కృషి ఫలితంగా రెండు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం సాకారమైందని మోదీ అన్నారు. ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, భారతీయ వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, పాదరక్షలు, సముద్ర ఆహార ఉత్పత్తులకు బ్రిటన్ లో చక్కటి మార్కెట్ లభిస్తుందని, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పరిశ్రమకు మార్కెట్‌లో కొత్త అవకాశం లభిస్తుందని ప్రధాని అన్నారు. ముఖ్యంగా ఈ ఒప్పందంతో భారతీయ యువత, రైతులు మత్స్యకారులు, పరిశ్రమల రంగాలకు ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. భారతదేశంలోని ప్రజలు కూడా బ్రిటన్ లో పరిశ్రమలు తయారు చేసిన వైద్య పరికరాలు, ఏరో స్పేస్ విడిభాగాలు, ఇతర ఉత్పత్తులను సరసమైనధరలకు పొందగలరని మోదీ తెలిపారు. బ్రిటీష్ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ ఈ వాణిజ్య ఒప్పందం వల్ల ఉభయదేశాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, సంబంధాలు మెరుగవుతాయని అన్నారు.

# ముంబై పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ :** ముంబై బాంబు పేలుళ్ళ కేసులో ఇచ్చిన తీర్పు అమలుపై సుప్రీం కోర్టు స్టే విధించింది. 2006లో జరిగిన ముంబై రైలు పేలుళ్ళ కేసులో నిందితులుగా వున్న 12మందినీ నిర్దోషులుగా విడిచిపెడుతూ బాంబే హైకోర్టు తీర్పు ఇచ్చింది. దానిపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో అప్పీల్ చేసింది. ఆ అప్పీల్‌ను విచారించిన సుప్రీం, ఈ కేసులో ఇచ్చిన తీర్పును ఇతర కేసుల్లో చట్టపరమైన ఉదాహరణగా చూపాల్సిన అవసరం లేదని పేర్కొంది. మహారాష్ట్ర సంఘటిత నేరాల నియంత్రణా చట్టం (మోకా) కింద నమోదైన కేసులపై విచారణ సాగుతున్న సందర్భంలో ఈ కేసు తీర్పును ఉదాహరణగా చూపరాదని పేర్కొంది. అలాగే ఇప్పుడు బాంబే హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చినందున జైలునుండి విడుదలైన నిందితులందరూ మళ్ళీ లొంగిపోవాల్సిన అవసరం లేదని కూడా ఈ సందర్భంగా సుప్రీం స్పష్టం చేసింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ ముందు మహారాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, తీర్పు అమలుపై తాత్కాలికంగా స్టే విధించాలని కోరారు. బాంబే హైకోర్టు తీర్పులోని న్యాయపరమైన తప్పులు మోకా కింద ఇతర కేసుల విచారణను ప్రభావితం చేయరాదని అందువల్ల ఆ తీర్పు అమలుపై స్టే విధించాలని కోరుతున్నామన్నారు. ''వారిని వెనక్కి జైలుకు తీసుకురావడానికి మేం స్టే కోరడం లేదు. అది మా ఉద్దేశ్యం కూడా కాదు, కానీ చట్టానికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన కొన్ని నిర్ధారణలు మోకా కింద సాగుతున్న విచారణలను ప్రభావితం చేస్తున్నాయని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు.



# ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 225/2

- చెలరేగిన ఓపెనర్లు డకెట్, క్రాలే
- భారత్ తొలి ఇన్నింగ్స్ 358
- స్టోక్స్‌కు ఐదు వికెట్లు జూ నాలుగో టెస్టు



ఐదు టెస్టుల సిరీసలో తొలిసారిగా ఇంగ్లండ్ తమ బజ్‌బాల్ ఆటను రుచి చూపించింది. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఓపెనర్లు డకెట్ (100 బంతుల్లో 13 ఫోర్లతో 94), క్రాలే (113 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 84) వన్డే తరహాలో చెలరేగారు. దీంతో దాదాపు ఐదు పరుగుల రన్‌రేట్‌తో ఆతిథ్య జట్టు స్కోరు దూసుకెళ్లింది. ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగిన ఇంగ్లండ్.. గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 225/2 స్కోరు సాధించింది. జడేజా, అన్షుల్‌కు ఒక్కో వికెట్ దక్కింది. ప్రస్తుతం 133 పరుగులు వెనుక బడి ఉండగా క్రీజులో పోప్ (20 బ్యాటింగ్), రూట్ (11 బ్యాటింగ్) ఉన్నారు. అంతకు ముందు భారత్ తొ లి ఇన్నింగ్స్‌లో 358 పరుగులు చేసింది. పంత్ (54), శార్దూల్ (41), సుందర్ (27) రాణించారు. స్టోక్స్‌కు ఐదు, ఆర్చర్‌కు మూడు వికెట్లు దక్కాయి.

చెలరేగిన స్టోక్స్, ఆర్చర్ : రెండో రోజు ఆటలో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ ఐదు వికెట్లకు తోడు ఆర్చర్ చెలరేగి భారత్‌ను ఎక్కువ సేపు క్రీజులో నిలువనీయలేదు. దీంతో 264/4 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ మరో 94 పరుగులకు మిగిలిన ఆరు వికెట్లను కోల్పోయింది. తొలి సెషన్ రెండో ఓవర్‌లోనే జడేజా (20)ను ఆర్చర్ వెనక్కి పంపినా.. శార్దూల్‌కు సుందర్ సహకరించాడు. అయితే ఓ ఊరించే బంతికి శార్దూల్‌ను స్టోక్స్ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే వర్షం కారణంగా ముందుగానే లంచ్ బ్రేక్‌కు వెళ్లారు. విరామం తర్వాత సుందర్, అన్షుల్ వికెట్లను ఒకే ఓవర్‌లో పడగొట్టిన స్టోక్స్ ఎనిమిదేళ్ల తర్వాత ఐదు వికెట్ల ఫీట్‌ను సాధించాడు. అటు పంత్.. ఆర్చర్ అద్భుత బంతికి బౌల్డయి తన పోరాటాన్ని ముగించాడు. కాసేపటికే బుమ్రా (4)ను సైతం ఆర్చర్ అవుట్ చేసి భారత్ ఇన్నింగ్స్‌కు తెరదించా డు. 21 పరుగుల వ్యవధిలోనే గిల్ సేన చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది.

ఓపెనర్ల జోరు : రెండో సెషన్ మధ్యలో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ దూకుడే లక్ష్యంగా ముందుకు సాగిం ది. ఓపెనర్లు డకెట్, క్రాలే ధాటికి భారత పేస్ త్రయం బుమ్రా, అన్షుల్, సిరాజ్ ప్రభావం చూపలేదు. దీంతో టీ బ్రేక్ సమయానికి 14 ఓవర్లలోనే 77 పరుగులు సాధించింది. డకెట్‌కు తోడు..అటు ఆరంభంలో తడబడిన క్రాలే కూడా లయ అందుకోవడంతో వికెట్ కోల్పోకుండానే ఆతిథ్య జట్టు ఈ సెషన్‌ను ముగించింది. ఇక ఆఖరి సెషన్‌లో ఏకంగా 148 పరుగులు చేరాయి. జడేజా తొలి ఓవర్‌లోనే క్రాలే 6,4తో 15 రన్స్ రాబట్టాడు. ఇలా ఇద్దరూ అలవోకగా బౌండరీలు బాదేయడంతో 29వ ఓవర్‌లోనే స్కోరు 150 దా టింది. అయితే భారత్ ఎదురుచూపులకు జడేజా తెరదిం చుతూ 32వ ఓవర్‌లో క్రాలేను అవుట్ చేశాడు. అప్పటికే తొలి వికెట్‌కు 166 పరుగులు జత చేరడం విశేషం. ఆ తర్వాత శతకానికి అతి చేరువలో ఉన్న డకెట్‌ను అరంగేట్ర పేసర్ అన్షుల్ అవుట్ చేశాడు. అయితే పోప్, రూట్ జాగ్రత్తగా ఆడుతూ వికెట్‌ను కోల్పోకుండా ఆటను ముగించారు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58బీ రాహుల్ (సి) క్రాలే (బి) వోక్స్ 46బీ సాయి సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61బీ గిల్ (ఎల్బీ) స్టోక్స్ 12బీ పంత్ (బి) ఆర్చర్ 54బీ జడేజా (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 20బీ శార్దూల్ (సి) డకెట్ (బి) స్టోక్స్ 41బీ సుందర్ (సి) వోక్స్ (బి) స్టోక్స్ 27బీ అన్షుల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0బీ బుమ్రా (సి) స్మిత్ (బి) ఆర్చర్ 4బీ సిరాజ్ (నాటౌట్) 5బీ ఎక్స్‌ట్రాలు: 30బీ మొత్తం: 114.1 ఓవర్లలో 358 ఆలౌట్. వికెట్ల పతనం: 194, 2120, 3140, 4235, 5266, 6314, 7337, 8337, 9349, 10358. బౌలింగ్: వోక్స్ 235661బీ ఆర్చర్ 26.13733బీ కార్స్ 211710బీ స్టోక్స్ 243725బీ డాసన్ 15 1451బీ రూట్ 50190.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రాహుల్ (బి) జడేజా 84బీ డకెట్ (సి) జురెల్ (బి) అన్షుల్ 94బీ పోప్ (బ్యాటింగ్) 20బీ రూట్ (బ్యాటింగ్) 11బీ ఎక్స్‌ట్రాలు: 16బీ మొత్తం: 46 ఓవర్లలో 225/2. వికెట్ల పతనం: 1166, 2197. బౌలింగ్: బుమ్రా 13437 0బీ అన్షుల్ 101481బీ సిరాజ్ 100580బీ శార్దూల్ 50350బీ జడేజా 80371.

పంత్.. ఓ యోధుడిలా.. : రెండో రోజు తొలి సెషన్‌లో శార్దూల్ వికెట్ పడగానే క్రీజులోకి వస్తున్నదెవరో చూసి ప్రేక్షకులు ఒకింత షాక్‌కు గురయ్యారు. బుధవారం వోక్స్ ఓవర్‌లో కుడి పాదానికి గాయమై నడువ లేని స్థితిలో పంత్ మైదానం వీడిన సంగతి తెలిసిందే. కాలికి ఫ్రాక్చరైన తను తిరిగి బ్యాటింగ్ చేస్తాడని బహుశా ఎవరూ ఊహించలేదేమో. కానీ శార్దూల్ అవుటయ్యాక మరే స్పెషలిస్ట్ బ్యాటర్ లేకపోవడంతో పంత్.. కుంటుతూనే బ్యాట్ చేతపట్టి క్రీజులోకి అడుగుపెట్టాడు. అయితే స్టోక్స్‌తో పాటు ఆర్చర్ అతడి పాదాన్ని లక్ష్యంగా చేస్తూ బంతులు విసిరి ఇబ్బంది పెట్టారు. అయినా కాలి నొప్పితోనే తను సింగిల్స్ తీయగా, చెత్త బంతులను బౌండరీలుగా మలుస్తూ హాఫ్ సెంచరీ సాధించడం విశేషం. మరోవైపు పంత్ చివరి టెస్టు ఆడేది సందేహమే కాబట్టి తమిళనాడు కీపర్ ఎన్.జగదీషన్‌ను ఇంగ్లండ్‌కు రప్పించనున్నారు. భారత్ తరపున టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (90) బాదిన బ్యాటర్‌గా సెహ్వాగ్‌తో సమంగా నిలిచిన పంత్. అలాగే ఒకే సిరీస్‌లో ఎక్కువ (5) 50ం స్కోర్లు సాధించిన భారత కీపర్‌గా పంత్.

## టెస్టుల్లో పంత్ రికార్డుల హోరు.. ఈసారి సెహ్వాగ్ రికార్డుకు ఎసరు..!

సుదీర్ఘ ఫార్మాట్‌లో రిషభ్ పంత్ ఆట ఓ రేంజ్‌లో ఉంటుంది. బజ్‌బాల్‌ను తలదన్నే విధ్వంసం అతడి సొంతం. విదేశీ గడ్డపై పరుగుల వరద పారించే పంత్ ఇప్పటికే పలు రికార్డులు బద్దలు కొట్టాడు. ఇంగ్లండ్ పర్యటనలో రెచ్చిపోయి ఆడుతున్న ఈ చిచ్చరపిడుగు ఇప్పుడు మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఘనతపై గురి పెట్టాడు. మాంచెస్టర్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో కళ్లు చెదిరే రీతిలో బంతిని స్టాం డ్స్ లో కి పంపిన ఈ వికెట్ కీపర్.. 90 సిక్సర్లతో వీరూ రికార్డును సమం చేశాడు. తొలి రోజు కుడి పాదానికి గా యం తో మైదానం వీడిన పంత్.. శార్దూల్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చాడు. జోఫ్రా ఆర్చర్ ఓవర్లో లెగ్ సైడ్ బంతిని సిక్సర్‌గా మలిచిన అతడు సెహ్వాగ్ తర్వాత 90వ సిక్సర్ బాదిన రెండో భారతీయుడిగా అవతరించాడు. రెండో ఇన్నింగ్స్‌లో మరొక్కటి కొట్టాడంటే భారత్ తరపున ఈ ఫార్మాట్లలో అత్యధిక సిక్సర్ల వీరుడిగా పంత్ పేరు రికార్డు పుస్తకాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది.



ఎందుకంటే.. : అతడికి దరిదాపుల్లో ఎవరూ లేరు. సెహ్వాగ్ ఎప్పుడో వీడ్కోలు పలకగా.. ఈ ఏడాదే రోహిత్ శర్మ (88 సిక్సర్లు), మాజీ సారథి ఎంఎస్ ధోనీ( 78 సిక్సర్లు) సైతం రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం 74 సిక్సర్లతో ఐదో స్థానంలో ఉన్న రవీంద్ర జడేజా ఇంకెన్ని రోజులు ఆడుతాడో చెప్పలేం. ఒకవేళ జడ్డూ వచ్చే ఏడాది వరకూ ఆడినా.. పంత్‌ను అందుకోలేడు. సో.. టెస్టుల్లో 'స్పైడీ' ఫీట్‌ను బీట్ చేసే ఇండియన్ ఉండరేమో.

మొదటి వికెట్ కీపర్.. : అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో వీరవిహారం చేస్తున్న పంత్ అసాధ్యమనుకున్న రికార్డులను తన వశం చేసుకుంటున్నాడు. మాంచెస్టర్ టెస్టులో హాఫ్ సెంచరీతో ఒకే సిరీస్‌లో అత్యధికంగా ఐదు పర్యాయాలు ఈ ఫీట్ సాధించిన భారత వికెట్ కీపర్‌గా రికార్డు నెలకొల్పాడు పంత్. ఫారుక్ ఇంజనీర్, ఎంఎస్ ధోనీలు నాలుగు అర్ధ శతకాలతో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నారు. ఫారుక్ 197273 పర్యటనలో ఇంగ్లండ్‌పైనే ఫిఫ్టీల మోత మోగించాడు. మహీ భాయ్ రెండుసార్లు నాలుగేసి హాఫ్ సెంచరీతో ఆస్ట్రేలియా(200809), ఇంగ్లండ్(2014)కు దడ పుట్టించాడు.




## రెజ్లింగ్ దిగ్గజం హల్క్ ఇక లేరు..

ఫైట్‌తోనే కాదు ముచ్చటైన మీసాలతోనూ పాపులర్ అయిన హల్క్ హొగన్ కన్ను మూశాడు. అమెరికాకు చెందిన హల్క్ గురువారం గుండెపోటుతో మరణించాడు. 1980ల్లో ఓ వెలుగు వెలిగిన హల్క్ 71 ఏళ్ల వయసులో ఫ్లోరిడాలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచాడు. ఆయన మరణవార్తను డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ధ్రువీకరించింది. డబ్ల్యూడబ్ల్యూ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఒకడైన లెజెండరీ రెజ్లర్‌ను కోల్పోయామని సంతాపం తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. హల్క్ అసలు పేఉరు టెర్నీ జెనె బొల్లయ. 1935 ఆగస్టు 11న జార్జియాలోని అగస్తాలో జన్మించాడు హల్క్. రెజ్లింగ్ మీద ఆసక్తి పెంచుకున్న ఆయన 1970లో ప్రొఫెషన్‌గా బరిలోకి దిగాడు. 1980వ దశకంలో ఎదురులేని మల్లయోధుడిగా అవతరించిన హల్క్.. తన హ్యాండిల్ బార్ మీసాలతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. గ్లోబల్ సూపర్ స్టార్‌గా మారిన ఆయన 'డబ్ల్యూడబ్ల్యూఈ హాల్ ఆఫ్' ఫేమ్‌లో చోటు దక్కించుకున్నాడు. రింగ్‌లోకి దిగడమే ఆలస్యం ప్రత్యర్థులకు దడపుట్టించే హల్క్.. రింగ్ అవతల మాత్రం చాలా ప్రశాంతంగా ఉండేవాడు. ఆయన జీవిత సిద్ధాంతం కూడా చాలా సింపుల్. 'కష్టపడండి. ప్రార్థనలు చేయండి. విటమిన్లతో కూడిన ఆహారం తినండి. మీపై మీరు నమ్మకం కలిగి ఉండండి' అని తన అభిమానులకు.. ముఖ్యంగా పిల్లలతో తరచూ చెప్పేవాడు హల్క్.

## సెమీస్‌లో టింగ్జి లీపై హంపి అద్భుత విజయం

ప్రతిష్టాత్మక ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో భారత ప్లేయర్లు అదరగొడుతున్నారు. ఇప్పటికే ఈ మెగాటోర్నీలో భారత యువ ప్లేయర్ దివ్యదేశ్‌ముఖ్ ఫైనల్లోకి దూసుకెళ్లగా, తాజాగా తెలుగు తేజం కోనేరు హంపి తుదిపోరుకు అర్హత సాధించింది. గురువారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన సెమీస్ పోరులో హంపి 53 తేడాతో చైనా చెందిన టింగ్జి లీపై అద్భుత విజయం సాధించింది. తొలి రెండు గేములు స్కోర్లు సమం కావడంతో పోరు టైబ్రేక్‌కు దారితీసింది. మొత్తం ఎనిమిది రౌండ్లలో రౌండ్ రౌండ్‌కు ఆధిక్యం చేతులు మారుకుంటూ వచ్చింది. ర్యాపిడ్ స్టయిల్‌లో తొలి రెండు టైబ్రేక్‌లు డ్రా కావడంతో ఇద్దరి ప్లేయర్ల స్కోర్లు 22తో సమైంది. అయితే మూడో ర్యాపిడ్ రౌండ్‌లో హంపి తప్పిదాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్న టింగ్జి విజయం సాధించడంతో స్కోరు 32కు చేరుకుంది. వెంటనే పుంజుకున్న హంపి నాలుగో రౌండ్‌లో తెల్లపావులతో..చైనా ప్లేయర్‌కు చెక్ పెట్టడంతో స్కోరు 33కు చేరుకుంది. అటు తర్వాత జరిగిన రెండు బ్లిట్జ్ గేముల్లో హంపినే విజయం వరించింది. తొలి గేమ్‌లో తెల్లపావులతో టింగ్జి భరతం పట్టిన హంపి ఆధిక్యాన్ని 43కు పెంచుకుంది. అదే దూకుడుతో ఆఖరిదైన రెండో గేమ్‌లో నల్లపావులతో చైనా ప్లేయర్‌ను ఓడిరచడంతో హంపి గెలుపు ఖరారైంది. శనివారం నుంచి టోర్నీ ఫైనల్ పోరు మొదలుకానుంది. ఫైనల్‌కు క్వాలిఫై అవడంతో క్యాండిడేట్స్ టోర్నీకి హంపి అర్హత సాధించింది. మూడో స్థానం కోసం జరిగే వర్గీకరణ పోరులో చైనా ప్లేయర్లు టింగ్జి లీ, టాన్ జాంగ్జి తలపడనున్నారు.



## ఇంగ్లండ్ దంచుడు.. డకెట్, క్రాలీ దూకుడు

భారత బ్యాటర్లు పరుగుల కోసం తంటాలు పడ్డ చోట ఇంగ్లండ్ దంచుడు మంత్రాన్ని జపిస్తున్నది. మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్టులో ఆ జట్టు రెండో రోజు బంతితో పాటు బ్యాట్‌తోనూ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఓపెనర్లు బెన్ డకెట్ (100 బంతుల్లో 94, 13 ఫోర్లు), జాక్ క్రాలీ (113 బంతుల్లో 84, 13 ఫోర్లు, 1 సిక్స్) బజ్‌బాల్ ఆటతో అలరించడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 46 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఒలీ పోప్ (20లి), జో రూట్ (11లి) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఇంకా 133 రన్స్ వెనుకబడి ఉంది. వికెట్ల వేటలో భారత బౌలర్లు తేలిపోయారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా.. ఓవర్‌నైట్ స్కోరు (264/4)కు మరో 94 రన్స్ జోడిరచి 358 పరుగులకు ఆలౌట్ అయింది. స్టోక్స్ (5/72) ఐదు వికెట్లతో మెరవగా జోఫ్రా ఆర్చర్ (3/73) రాణించాడు.


లోయరార్డర్ పోరాటం.. : ఇంగ్లండ్ పేసర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో రెండో రోజు భారత్ భారీ స్కోరు చేయడంలో విఫలమైనా లోయరార్డర్ బ్యాటర్లు పోరాడటంతో గౌరవప్రదమైన స్కోరు సాధించింది. రెండో రోజు ఆటలో గిల్ సేనకు రెండో ఓవర్లోనే ఎదురుదెబ్బ తగిలింది. ఆర్చర్.. జడేజా (20)ను ఔట్ చేసి దెబ్బకొట్టాడు. కానీ శార్దూల్ (41), వాషింగ్టన్ (27) ఏడో వికెట్‌కు 48 రన్స్ జతచేయడంతో



భారత్ 300 పరుగుల మార్కును అధిగమించింది. అయితే డ్రింక్స్ విరామం తర్వాత స్టోక్స్.. శార్దూల్‌ను ఔట్ చేసి భారత్ 400 టార్గెట్ ఆశలపై నీళ్లు చల్లాడు. శార్దూల్ స్థానంలో తొలిరోజు కాలిగాయంతో క్రీజును విడిచిన రిషభ్ పంత్ (54) బ్యాటింగ్‌కు వచ్చినా లంచ్ విరామం తర్వాత స్టోక్స్ భారత్‌కు మరో షాకిచ్చాడు. క్రీజులో కుదురుకున్న వాషింగ్టన్‌ను ఇంగ్లండ్ సారథి షార్ట్‌బాల్‌తో బోల్తా కొట్టించాడు. అదే ఓవర్లో అన్షుల్ సైతం ఒక్క పరుగు చేయకుండానే కీపర్ స్మిత్‌కు క్యాచ్ ఇవ్వడంతో స్టోక్స్ ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. కాలినొప్పితోనే అర్ధ శతకం పూర్తిచేసిన పంత్.. ఆర్చర్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అతడే.. బుమ్రాను ఔట్ చేయడంతో భారత ఇన్నింగ్స్ ముగిసింది.


## దీపక్‌హుడా బతికిపోయాడు.. వరదలో కాపాడిన పోలీసులు

**హరిద్వార్:** భారత కబడ్డీ మాజీ కెప్టెన్ దీపక్ హుడా ప్రాణాలతో బతికిపోయాడు. హరిద్వార్ దగ్గర గంగా నదిలో కొట్టుకుపోతున్న దీపక్‌ను ఉత్తరాఖండ్ పోలీసులు కాపాడిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియోను పోలీసులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో దీపక్.. మెహమ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేశాడు. భారీ వరద నుంచి తనను కాపాడిన ఉత్తరాఖండ్ పోలీసులకు ఈ సందర్భంగా అతడు కృతజ్ఞతలు తెలిపాడు. ఇదిలాఉండగా ఎడతెరిపి లేని వర్షాలతో హిమాచల్ ప్రదేశ్‌తో పాటు ఉత్తరాఖండ్‌లో గంగా నది భీకర స్థాయిలో ప్రహిస్తున్నది.



## సింధుకు షాకిచ్చిన ఉన్నతి.. క్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

భారత బ్యాడ్మింటన్ యువ సంచలనం ఉన్నతి హుడా తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనను నమోదుచేసింది. చైనా ఓపెన్‌లో 17 ఏండ్ల ఈ అమ్మాయి.. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, స్టార్ షట్లర్ పీవీ సింధుకు షాకిచ్చింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఉన్నతి.. 2116, 1921, 2113తో తన (35)కంటే మెరుగైన ర్యాంకు కలిగిన సింధు (15)ను ఓడిరచి క్వార్టర్స్ చేరింది. ఇక ఈ విజయంతో ఉన్నతి.. చైనా ఓపెన్‌లో క్వార్టర్స్ చేరిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డులకెక్కింది. పురుషుల డబుల్స్ విషయానికొస్తే సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి ద్వయం 2119, 2119తో మౌలానాకర్నండొ (ఇండోనేషియా)ను ఓడిరచి క్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్.. 2118, 1521, 821తో ఆరో సీడ్ చైనీస్ తైపీ షట్లర్ చౌ టైన్ చెన్ చేతిలో పోరాడి ఓడాడు.




## వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌లో సత్తా

- యూఎస్‌లోని అలబామాలో అంతర్జాతీయ పోలీసు క్రీడలు
- 10 పతకాలతో తెలంగాణ పోలీసుల హవా

గతనెల 27 నుంచి జూలై మొదటివారం వరకు యూఎస్‌లోని అలబామాలో జరిగిన వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్2025లో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. 3 స్వర్ణ, 1 రజతం, 6 కాంస్య పతకాలతో అదరగొట్టారు. తెలంగాణ పోలీసు స్విమ్మింగ్ క్రీడల కోచ్ పి.కృష్ణారావు (హెచ్‌సీ 2077, డీఏఆర్ వనపర్తి) 50 ఏండ్లకు పైబడిన వయసు కేటగిరీలో ఇండోర్ రోయింగ్ 2,000 మీటర్లు, 500 మీ. ఈవెంట్లలో 2 స్వర్ణ పతకాలు సాధించారు. అథ్లెటిక్స్ కోచ్ మహ్మద్ బాబా (పీసీ 708, పెద్దకొడప్‌గల్, కామారెడ్డి) 35 ఏండ్ల కేటగిరీలో షాట్‌పుట్, 110 మీటర్ల హర్డిల్స్‌లో 2 కాంస్య పతకాలు నెగ్గారు. తెలంగాణ పోలీసు టైక్వాండో ఆటగాళ్లు డి.గోపాలకృష్ణయ్య (హెచ్‌సీ 3144, రాజేంద్రనగర్, సైబరాబాద్) 40ం ఏజ్ కేటగిరీలో రజతం, రికగ్నైజ్డ్ పూమ్సే, ఫ్రీస్టైట్కల్ పూమ్సేలో 2 కాంస్య పతకాలు సాధించారు. డి.సంజీవ్ కుమార్ (ఏఆర్‌పీసీ 9025, అంబర్‌పేట్, రాచకొండ పోలీస్ కమిషనరేట్) 30ం ఏజ్ కేటగిరీ క్యోరుగి ఈవెంట్‌లో 1 స్వర్ణ పతకం, రికగ్నైజ్డ్ పూమ్సే, ఫ్రీట్కస్టైల్ పూమ్సేలో 2 కాంస్య పతకాలు గెలుచుకున్నారు. విజేతలను తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ ఐపీఎస్ అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తాటాకు చప్పుళ్లకు బెదరను



'నా జీవితంలో ఏదీ తేలిగ్గా దొరకలేదు. నా జీవితం వడ్డించిన విస్తరి కానేకాదు. విజయాలు కూడా కష్టపడితేనే కానీ నాకు రాలేదు. 'హరిహర వీరమల్లు' కూడా అలాంటి విజయమే. సక్సెస్‌లు, రికార్డుల గురించి పట్టించుకోవడం మొదట్నుంచీ నాకు అలవాటు లేదు. సినిమాను కొందరు బాయ్‌కాట్ చేస్తాం అంటున్నారు. నెగెటివ్ రివ్యూలు కూడా ఇస్తున్నారు. ఇలాంటి తాటాకు చప్పళ్లను బెదరను' అన్నారు పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటించిన హిస్టారికల్ ఫిక్షన్ 'హరిహర వీరమల్లు'. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వంలో, ఏ.ఎం.రత్నం సమర్పణలో, ఏ. దయాకరరావు నిర్మించిన ఈ చిత్రం ఈ గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'నేను ఒక సినిమా చేస్తే ఆ సినిమా మిమ్మల్ని భయపెడుతుందంటే, అది నా స్థాయి. పీరియడ్ ఫిల్మ్ ఇంతకు ముందు చేయలేదు. ఇదో కొత్త అనుభవం. హిస్టరీలో మనం మొఘలుల గొప్పతనం మాత్రమే చదువుకున్నాం. వాళ్లు చెత్త పనులు కూడా చేశారు. ఔరంగజేబు లాంటి వాళ్లు దారుణాలకు తెగబడ్డారు. వాటన్నింటినీ వైట్ వాష్ చేసి మనకు వినిపించారు గత పాలకులు. హిందువులపై వారు విధించిన జిజియా పన్ను గురించి లైట్‌గా టచ్ చేసి వదిలేశారు. మన శ్రీకృష్ణదేవరాయల్ని, రాణీరుద్రమదేవిని, కాకతీయ, పల్లవ చరిత్రలను మన గత పాలకులు చిన్నచూపు చూశారు అనిపించింది. అందుకే వాటన్నింటి గురించి ఈ సినిమాలో చర్చించేందుకు ప్రయత్నించాం. అందుకని ఇది హిందూ, ముస్లింల మధ్య జరిగే యుద్ధం మాత్రం కాదు. ఒక అరాచకంపై, మత విద్వేషంపై జరిగిన యుద్ధం. ఈ సినిమా పార్ట్ 2 కూడా 30శాతం పూర్తయింది. ఈ సినిమా విడుదలకు సహకరించిన మైత్రీ మూవీమేకర్స్‌కు థ్యాంక్స్ చెప్పకుంటున్నా. టెక్నికల్‌గా కొన్ని సమస్యలుండొచ్చు. దాన్ని సెకండాఫ్‌లో సరిచేసుకుంటాం' అని అన్నారు. ఇంకా దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఏ.ఎం.రత్నం, కథానాయిక నిధి అగర్వాల్, మైత్రీమూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ కూడా మాట్లాడారు.

# పాటల పల్లకిలో మిరాయ్



'హనుమాన్' చిత్రంతో మంచి గుర్తింపును సంపాదించుకున్న యువహీరో తేజ సజ్జా నటిస్తున్న తాజా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. పీరియాడిక్, ఫాంటసీ అంశాలతో రూపొందిస్తున్న సూపర్‌హీరో కథాంశమిది. సెప్టెంబర్ 5న 2డీ, త్రీడీ ఫార్మాట్లలో పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 26న 'వైబ్ ఉంది..' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. వినాశకర శక్తుల నుంచి ఈ ప్రపంచాన్ని రక్షించే ఓ యోధుడి కథ ఇదని, విలన్‌గా మంచు మనోజ్ నటిస్తున్నారని మేకర్స్ తెలిపారు. రితికా నాయక్, శ్రియ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గౌరహరి, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని.



# దేనికైనా టైమ్ రావాలి : మృణాళ్ ఠాకూర్

తెలుగులో ఇప్పటివరకూ మూడు సినిమాల్లో నటించింది మృణాళ్ ఠాకూర్. వాటిలో సీతారామం, హాయ్ నాన్న బాగా ఆడాయి. 'ఫ్యామిలీ స్టార్' మాత్రం కాస్త చేదు అనుభవాన్నే ఇచ్చింది. ప్రస్తుతం ఆమె తెలుగులో అడివి శేష్‌తో 'డెకాయిట్'లో నటిస్తున్నది. ఓ వైపు తెలుగులో సెలక్టివ్‌గా సినిమాలు చేస్తూ, మరోవైపు బాలీవుడ్‌లోనూ తన గుర్తింపును కాపాడుకుంటున్నది ఈ మరాఠీ సుందరి. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆమె నటించిన 'సన్నాఫ్ సర్దార్ 2' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీబిజీగా ఉన్న మృణాళ్ పెళ్లి గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'పెళ్లాడాలని, అమ్మని కావాలని నాకూ ఉంది. కాబోయే భర్త, పిల్లల విషయంలో ఇప్పటికీ కలలు కంటూనే ఉన్నా. ఆ విషయంలో నాకంటూ కొన్ని ఆశలున్నాయి. అయితే.. దేనికైనా రైట్ టైమ్ రావాలి. ప్రస్తుతం నా దృష్టి అంతా కెరీర్ పైనే. నటిగా ఇంకా చాలా సాధించాలి. కెరీర్ పరంగా సంతృప్తి చెందాకే.. పెళ్లి' అని అందంగా నవ్వేశారు మృణాళ్ ఠాకూర్.



# అంబరాన్ని తాకిన అభిమానం

అగ్ర హీరో ఎన్టీఆర్ ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మ్యాన్ ఆఫ్ మాసెస్, సిల్వర్ స్క్రీన్ డైనమైట్ అంటూ అభిమానులు ఆయన్ని గర్వంగా పిలుస్తుంటారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో ఎన్టీఆర్ క్రేజ్ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కలిసి నటించిన స్పైయాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2' ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. హిందీలో ఎన్టీఆర్ నటించిన తొలి స్ట్రెయిట్ చిత్రమిదే కావడంతో అంచనాలు మరింత ఎక్కువయ్యాయి. ఈ సినిమా కోసం కొందరు అభిమానులు వినూత్న రీతిలో ప్రమోషన్స్ నిర్వహిస్తూ ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ సరికొత్త పంథాలో ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించారు. ప్రత్యేక ఏర్పాట్లతో విమానాల ద్వారా ఆకాశంలో ఎన్టీఆర్, వార్ 2 అనే పేర్లను డిస్‌ప్లే చేశారు. గగనవేదికపై తమ అభిమాన కథానాయకుడి పేరు చూసుకొని అక్కడి ఫ్యాన్స్ థ్రిల్ ఫీలయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందించిన 'వార్ 2' చిత్రానికి ఆయాన్‌ముఖర్జీ దర్శకత్వం వహించారు.

# హీరో దర్శన్ బెయిల్‌పై 'సుప్రీం' అసంతృప్తి..!





విచాక్షణాధికారాన్ని దుర్వినియోగం చేసిందని వ్యాఖ్యలు..!

రేణుకస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్ తూగుదీపతో పాటు ఆరుగురు నిందితులకు కర్నాటక హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది విచక్షణాధికార దుర్వినియోగమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రేణుకస్వామి హత్య కేసులో నటుడు దర్శన్ బెయిల్‌ను రద్దు చేయాలని కర్నాటక ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పు సుప్రీంకోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. జస్టిస్ జేబీ పార్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కర్నాటక ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించి, తీర్పును వాయిదా వేసింది. హత్య కేసులో దర్శన్‌తో పాటు ఆరుగురికి కర్నాటక హైకోర్టు గతేడాది డిసెంబర్ 13న బెయిల్ మంజూరు చేసింది. అయితే, హైకోర్టు నిర్ణయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. కర్నాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా, నిందితుల తరఫున సిద్ధార్థ్ దవేతో పాటు ఇతరుల వాదనలు సుప్రీంకోర్టు విన్నది. ప్రభుత్వంతో పాటు పలువురు దాఖలు చేసిన లిఖితపూర్వక వాదనలను కోర్టు రికార్డు చేసింది. ఇతర నిందితుల తరపు న్యాయవాదిని వారంలోగా లిఖితపూర్వక వాదనలు దాఖలు చేయాలని ఆదేశించింది. హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై జస్టిస్ పార్దివాలా డిఫెన్ న్యాయవాదిని ప్రశ్నించారు. బెయిల్ పిటిషన్లపై తీర్పును వెలువరిస్తూ ఏడుగురు నిందితులను నిర్దోషులు విడుదల చేస్తూ హైకోర్టు ఆదేశించిందని మీరు అనుకోలేదా..? అని ప్రశ్నించారు. హైకోర్టు బెయిల్ ఆర్డర్ జారీ చేసిన విధానం ఆందోళన కలిగించే విషయమని ధర్మాసనం పేర్కొంది. ప్రతి బెయిల్ కేసులో హైకోర్టు ఇదే రకమైన ఆర్డర్ జారీ చేస్తుందా? అని వ్యాఖ్యానించింది. ఇద్దరు ప్రత్యక్ష సాక్షులు వాంగ్మూలాల విషయంలో హైకోర్టు వ్యవహరించిన విధానాన్ని సైతం ధర్మాసనం ప్రశ్నించింది. ఈ సందర్భంగా జస్టిస్ జేబీ పార్దివాలా మాట్లాడుతూ నిందితులకు బెయిల్ మంజూరు చేయడంలో విచక్షణాధికారాలను దుర్వినియోగం చేయడమేనన్నారు. హైకోర్టు న్యాయపరంగా తన విచక్షణను ఉపయోగించిందా..?' అంటూ ప్రశ్నించారు. రేణుకస్వామి హత్య కేసులో నిందితులకు బెయిల్ ఇవ్వడంపై బెంచ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. విచక్షణాధికారాన్ని ఉపయోగించిన విధానంతో తాము సంతృప్తిగా లేమని పేర్కొంది. జస్టిస్ పార్దివాలా మాట్లాడుతూ 'నిజం చెప్పాలంటే హైకోర్టు విచక్షణాధికారాన్ని ఉపయోగించిన విధానంతో తాము సంతృప్తి చెందలేదు' అని అన్నారు. ఈ నెల 24న రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు పవిత్ర గౌడతో పాటు ఈ కేసులో నిందితులకు నోటీసులు జారీ చేసింది. దర్శన్ అభిమాని అయిన రేణుకస్వామి గతేడాది జూన్‌లో హత్యకు గురవగా.. ఈ కేసులో దర్శన్‌ను జూన్ 11న పోలీసులు అరెస్టు చేశారు.






# ఎల్‌సీయూ అలా మొదలైంది

'ఖైదీ''విక్రమ్' చిత్రాలతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు లోకేష్ కనకరాజ్. ఆయన దర్శకత్వంలో రజనీకాంత్ నటించిన 'కూలీ' వచ్చే నెల 14న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'లోకేష్ కనకరాజ్ సినిమాటిక్ యూనివర్స్' అనే ఆలోచన ఎలా వచ్చిందో పంచుకున్నారాయన. 'విక్రమ్ స్క్రిప్ట్ వర్క్ టైమ్‌లో కరోనా కారణంగా కొన్నాళ్లు రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఆఫీస్‌లోనే ఉండిపోయా. అక్కడే 'విక్రమ్' కథ లాక్ చేశాం. అయితే.. అందులో ఒక పాత్ర.. 'ఖైదీ'లోని ఇన్‌స్పెక్టర్ బిజోయ్ పాత్రను పోలి ఉంటుంది. అందుకే 'ఖైదీ'లో ఆ పాత్రను పోషించిన నరేన్‌తోనే ఈ పాత్ర కూడా చేయించాలనుకున్నా. సరిగ్గా అప్పుడే ఒక ఆలోచన వచ్చింది. అసలు కొత్త పాత్రను తెచ్చే బదులు.. 'ఖైదీ'లోని బిజోయ్ పాత్రనే 'విక్రమ్'లో కూడా కొనసాగిస్తే సరిపోతుంది కదా? అనిపించింది. దీంతో ఆ ఒక్క పాత్రనే కాక, 'ఖైదీ'లోని సాధ్యమైనన్ని పాత్రలను క్రాస్ ఓవర్ చేయాలన్న ఆలోచన వచ్చింది. అలాగే కథలో కూడా 'ఖైదీ'లోని పసిబిడ్డ తాలూకు ఎమోషన్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం ఇందులోనూ యాడ్ చేశా. మొత్తం స్క్రిప్ట్ పూర్తయ్యాక కమల్‌సార్‌కి వినిపిస్తే ఆయన ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా అభినందించారు. ఆ విధంగా 'లోకేష్ కనకరాజ్ సినిమాటిక్ యూనివర్స్'(ఎల్‌సీయూ) మొదలైంది' అంటూ చెప్పుకొచ్చారు లోకేష్ కనకరాజ్.

# కేసు నుంచి.. నటులను తప్పించేందుకు రూ.50 లక్షల లంచం



మాదకద్రవ్యాలను కొనుగోలు చేసిన నటులను అరెస్టు చేయకుండా ఉండేందుకు పోలీసులు రూ.50 లక్షల మేరకు లంచం తీసు కున్నట్టు డ్రగ్ సప్లయర్ ప్రదీప్ కుమార్ వాంగ్మూలం ఇచ్చాడు. తమ దగ్గర కొకైన్ వంటి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసిన నటులను అరెస్టు చేయకుండా ఉండేందుకు కొందరు పోలీసులు రూ.50 లక్షల మేరకు లంచం తీసు కున్నట్టు డ్రగ్ సప్లయర్ ప్రదీప్ కుమార్ వాంగ్మూలం ఇచ్చాడు. దీనిపై లోతైన దర్యాప్తు చేపట్టిన ఉన్నతాధికారులు.. క్రైమ్ బ్రాంచ్ స్పెషల్ ఇన్స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలపై చర్యలు తీసుకున్నారు. ఈ ముగ్గురినీ వీఆర్‌కు ఎటాచ్ చేశారు. మే 22న నుంగంబాక్కంలోని ఓ హోటల్లో రెండు గ్రూపుల మధ్య గొడవ జరగ్గా, దీనికి సంబంధించి నుంగంబాక్కం పోలీసులు అన్నాడీఎంకే నేత ప్రసాద్, ఈసీఆర్ రాజా, అజయ్ వాండయార్, రౌడీ సునామీ సేతు సహా మొత్తం 9 మందిని అరెస్టు చేశారు. ఈ గొడవకు కారణాలపై పోలీసులు లోతుగా ఆరా తీయగా, ఇందులో సేలంకు చెందిన ప్రదీప్ కుమార్ అలియాస్ బ్రిట్టో (38) వద్ద అధిక మొత్తంలో కొకైన్ కొనుగోలు చేసి నటుడు శ్రీకాంత్, శ్రీకృష్ణలకు సరఫరా చేసినట్టు ప్రసాద్ వెల్లడిరచాడు. ఆ తర్వాత ప్రదీప్ కుమార్ సహా ఆఫ్రికాకు చెందిన జాన్ (38)ను జూన్ 17న అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారం మేరకు హీరో శ్రీరామ్, శ్రీకృష్ణలను అరెస్టు చేయగా, ఆ తర్వాత వీరిద్దరు బెయిల్ పై విడుదలయ్యారు. అయితే ఈ కేసులో లోతుగా విచారణ జరిపేందుకు ట్రిప్లికేన్ క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, థౌజండ్ లైట్ పోలీస్ స్టేషన్లో పనిచేసే ఇద్దరు ఎస్సైలను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ బృందం ప్రసాద్, జాన్లను కస్టడీలోకి తీసుకుని విచా రించగా, అనేక మంది సినీ ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేసినట్టు వెల్లడిరచారు. వారిచ్చిన సమాచారం మేరకు మరో 26 మందిని అరెస్టు చేశారు. అలాగే, ప్రదీప్ కుమార్, నైజీరియాకు చెందిన సారా కొమామాను కస్టడీలోకి తీసుకుని, వారిని ప్రశ్నించారు. దీంతో నటీన టులకు డ్రగ్స్ సరఫరా చేసేందుకు విరుగంబాక్కంకు చెందన జెస్ వీర్ అలియాస్ కెవిన్ అనే వ్యక్తిని సహాకుడిగా నియమించుకున్నట్టు వారు పోలీసులకు చెప్పారు. అతడి ద్వారా శ్రీరామ్తో పాటు పలు వురు సినీ ప్రముఖులకు మాదక ద్రవ్యాలు సరఫరా చేసినట్టు వెల్ల డిరచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమను అరెస్టు చేయ కుండా ఉండేందుకు పలువురు నటీనటులు ప్రదీప్ కుమార్‌కు రూ.50 లక్షల వరకు ఇవ్వగా, వాటిని పోలీసులకు అందజేశారు. దీంతో ప్రత్యేక బృందం పోలీసులు ప్రదీప్ కుమార్‌ను నామమాత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. పైగా ఈ అంశంపై మరింత లోతుగా డిప్యూటీ కమిషనర్ విచారణ జరుపుతున్నారు. ఆదేసమయంలో లంచం తీసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సీఐ, ఇద్దరు ఎస్ఐలను వీఆర్కు పంపించారు. అలాగే ఈ కేసు నుంచి తప్పించుకున్న సటీ నటులు ఎవరనే అంశంపై ఆరా తీస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in